# త్యాగానికి, దేశభక్తికి ప్రతీక - జలియన్‌వాలా భాఘ్ నరమేధం

## (13 ఏప్రిల్ "జలియన్‌వాలా భాఘ్ నరమేధ దుర్ఘటన దినం" సందర్భంగా)

మొదటి ప్రపంచ యుద్ధం మిగిల్చిన గాయాలకు లేపనాలు రాస్తున్న వేళలవి. యుద్ధం మిగిల్చిన క్షతగాత్రుల రోదనలు మిన్నంటుతున్న అకాలాలవి. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుకున్న క్షణాలవి. అంటువ్యాధులు వెంటాడుతున్న అనారోగ్య రోజులవి. జాతీయ స్వాతంత్ర్యోద్యమం పుంజుకుంటున్న గడియలవి. 13 లక్షల భారత జవాన్లు విదేశాల్లో సేవలందిస్తూ పడిన వేదనలను గుర్తు చేసుకుంటున్న విపరీత పరిస్థితులవి. 43,000 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసి, విషాదంలో మునిగిన నిమిషాలవి. దుష్ట బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పిడికిలి బిగించి గర్జిస్తున్న గళాల సమయమది. చట్ట విరుద్ధంగా చేసిన రౌలట్ చట్టాన్ని బూచీగా చూపుతూ అణచివేతలు, అకారణ అరెస్టులు, అక్రమ నిర్బంధాలు, అసత్య అనుమానిత అరెస్టులకు తెగబడిన తెల్ల దొంగలకు వ్యతిరేకంగా భారతీయుల కడుపులు ఉడికిపోతున్న సందర్భాలవి.

డైయ్యర్ రాక్షస దుశ్చర్యకు వందల ప్రాణాలు గాల్లో కలిశాయి:

రౌలట్ చట్టం (బ్లాక్ చట్టం) గూర్చి పూర్తిగా అవగాహన లేని సామాన్య అమాయక అమృత్‌సర్ నగరవాసులు స్వర్ణదేవాలయ సమీపానగల జలియన్‌వాలా భాఘ్(భాఘ్ అనగా గార్డెన్ లేదా పూల తోట)లో 13 ఏప్రిల్ 1919 రోజున బైసాఖీ పర్వదినం శుభ వేళలో శాంతియుతంగా సమావేశం ఏర్పాటు చేయడంతో 10,000లకు పైగా పురుషులు, స్త్రీల, పిల్లలు ఆ సమావేశానికి హాజరై రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా తమ నిరసన గళాలను విప్పడానికి ప్రయత్నిస్తున్న సమయం, సందర్భం అది. ఈ సమావేశం గూర్చి సమాచారం అందుకున్న బ్రిగేడియర్-జనరల్ రెగినాల్డ్ డైయ్యర్ ఆవేశంతో జలియన్‌వాలా భాఘ్ ప్రాంతానికి తమ సాయుధ సైన్యంతో చేరి అమాయక ప్రజలను చుట్టుముట్టి ప్రవేశ ద్వారం వద్ద పరుగెత్తుతున్న ప్రజలపై కాల్పులు జరపడానికి ఆదేశాలివ్వడంతో నిర్దాక్షిణ్యంగా 10 - 12 నిమిషాల పాటు 1,650 రౌండ్ల కాల్పులు జరపడంతో శవాలు దిబ్బలు, గాయపడిన వారి హాహాకారాలు మిన్నంటాయి. ఈ దుర్మార్గపు దుశ్చర్యకు 379 మంది ప్రాణాలు అర్పించగా, 1,200 మంది గాయపడడం జరిగింది. భారత జాతీయ కాంగ్రెస్ వివరాల ప్రకారం దాదాపు 1,000కి పైగా మరణించినట్లు, 1,500 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తున్నది.

భారతీయుల రక్తం మరిగించిన మారణహోమ దుర్ఘటన:

ఈ అక్రమ నరమేధ దుర్ఘటనతో రగులుకున్న స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమాలు ఎగిసి పడ్డాయి. భగత్ సింగ్ లాంటి లక్షల మంది భారతీయ దేశభక్తుల్లో ఆవేశం రాజుకున్న దుర్ఘటన జలియన్‌వాలా భాఘ్ నరమేధ ఉదంతం. ఈ దుర్ఘటన అనంతరం అదే స్థలంలో స్మారక స్థూపం నిర్మించాలని నాటి కాంగ్రెస్ తీర్మానం చేయడం, 1960 ఏప్రిల్ 13న స్మారక స్థూపం ప్రారంభం కావడం గూర్చి మనకు తెలుసు. జలియన్‌వాలా భాఘ్ మారణకాండ రగిల్చిన అఖండ జ్వాలలు, భవన గోడలపై బులెట్లు తగిలిన గుర్తులు, కాల్పుల భయానికి దుక్కుతోచని స్థితిలో తోట బాయిలో దూకి మరణించిన విషాదకర దృశ్యాలు నేటికీ దేశభక్తుల మదిలో రగులుతూనే ఉన్నాయి.

ఏనాటికీ మరిచిపోలేని అమానవీయ రాక్షస డైయ్యర్ అహంకారాన్ని తమ మనసుల్లోనే గోరీ కట్టిన భారతీయులు నేటికీ వలస పాలకులను శత్రువులుగానే చూస్తున్నారు. ఈ నరమేధ దుర్ఘటన, అమాయకుల ప్రాణ త్యాగాల పునాదుల మీద స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున ఎగిసిపడడంతో తెల్ల దొంగలు పారిపోక తప్పని పరిస్థితులు ఏర్పడడం జరిగిందని గమనించాలి. ఈ మారణహోమం బ్రిటీష్ పాలకుల దురహంకారానికి నిదర్శనంగా నిలుస్తున్నదని, వారి పాలనపై ప్రతి భారతీయుడు కత్తి దూసే పరిస్థితులు రావడం జరిగిందని, స్వాతంత్ర్య స్వేచ్ఛకు ద్వారాలు తెరుచుకోవడం ప్రారంభమైందని గుర్తుంచుకోవాలి. జలియన్‌వాలా భాఘ్ అమర వీరులకు మనస్ఫూర్తిగా నివాళులు సమర్పిద్దాం, జై హింద్ అంటూ నినదిద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భారత్ వంటి దేశంలో సంస్కృతి మన జాతి ప్రతిష్ఠతో ముడిపడి ఉండటమే కాదు.. మన సామర్థ్యాన్ని బలోపేతం చేసేది ఆ సంస్కృతే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:భారత సాంస్కృతిక-ఆధ్యాత్మిక వారసత్వాలను ఇనుమడింపజేయడంపై తన నిబద్ధతకు అనుగుణంగా ప్రధాన మంత్రి ఈ రోజు మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ జిల్లా ఇసాగఢ్ తాలూకాలోగల ఆనంద్‌పూర్ ధామ్‌ను సందర్శించారు. అనంతరం గురూజీ మహారాజ్ ఆలయంలో దర్శనం-పూజలు కూడా చేశారు. ఆ క్షేత్రంలోని ఆలయ సముదాయాన్ని సందర్శించారు. అనంతరం సభనుద్దేశించి ప్రసంగిస్తూ- ఢిల్లీ, హర్యానా, పంజాబ్ సహా దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను తొలుత స్వాగతించారు. శ్రీ ఆనంద్‌పూర్ ధామ్ సందర్శన భాగ్యం లభించడం తన అదృష్టమని హర్షం వ్యక్తం చేశారు. గురూజీ మహారాజ్ ఆలయంలో ప్రార్థనానుభవాన్ని పంచుకుంటూ తన హృదయం ఆనందంతో నిండిపోయిందని ప్రకటించారు.

సాధువుల తపోఫలంతో ఈ నేల పవిత్రత ఇనుమడించిందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. అలాగే పరోపకారం ఈ గడ్డపై ఒక విశిష్ట సంప్రదాయంగా మారిందని, సేవా సంకల్పం మానవాళి సంక్షేమానికి మార్గం సుగమం చేస్తున్నదని పేర్కొన్నారు. అశోక్ నగర్‌లోకి తొంగి చూడాలన్నా దుఃఖం భయపడుతుందన్న సాధు వచనాన్ని ఈ సందర్భంగా ఉటంకించారు. బైశాఖి వేడుకలతోపాటు శ్రీ గురూజీ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడంపై ఆయన ఆనందం వెలిబుచ్చారు. ప్రథమ పదషాహి శ్రీశ్రీ 108వ స్వామి శ్రీ అద్వైతానంద్ మహారాజ్ సహా ఇతర పదషాహి సాధువులందరికీ శిరసాభివందనం అర్పించారు. ద్వితీయ పదషాహి గారి 1936నాటి మహాసమాధి, 1964లో తృతీయ పదషాహి నిజరూప శివైక్యాన్ని గుర్తుచేస్తూ నేటి చారిత్రక ప్రాముఖ్యాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ పూజ్య గురువులకు నివాళి అర్పించడంతో పాటు మాతా జగేశ్వరి దేవి, మాతా బీజాసన్, మాతా జానకి కరీల మాతా ధామ్‌లకు వందనమాచరించారు. బైశాఖి, శ్రీ గురు మహారాజ్ జీ జయంతి ఉత్సవాల నేపథ్యంలో అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

"రుషులు, జ్ఞానులు, సాధువులకు మన దేశం పుట్టినిల్లు. సమాజం క్లిష్ట దశలో ఉన్నపుడల్లా ఎవరో ఒక మహనీయుడు ఈ నేలపై అవతరించి సమాజానికి మార్గనిర్దేశం చేస్తుంటారు" అని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. పూజ్య స్వామి శ్రీ అద్వైతానంద్ మహారాజ్ జీవితం ఈ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆది శంకరాచార్య వంటి ఆచార్యుడు అద్వైత తత్వశాస్త్రం నిగూఢ జ్ఞానాన్ని విశదీకరించిన కాలాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. అయితే వలసపాలన సమయంలో సమాజానికి ఈ జ్ఞానంతో సంబంధాలు తెగిపోవడం మొదలైందని పేర్కొన్నారు. కానీ, అదే సమయంలో అద్వైత సిద్ధాంతంతో దేశంలో ఆత్మ చైతన్యం తెచ్చేందుకు రుషులు అవతరించారని చెప్పారు. అటువంటి మహనీయులలో పూజ్య శ్రీ అద్వైతానంద్ మహారాజ్ సామాన్యులందరికీ అద్వైత జ్ఞానాన్ని సరళరీతిలో అందుబాటులోకి తెచ్చి, నాటి వారసత్వాన్ని ముందుకు నడిపించారని స్పష్టం చేశారు.

నేటి ప్రపంచంలో భౌతిక పురోగమనం నడుమ యుద్ధాలు, సంఘర్షణలు, నైతిక విలువల క్షీణత వంటి అంతర్జాతీయ ఆందోళనకర అంశాలను శ్రీ మోదీ ఉటంకించారు. ఈ సవాళ్లకు మూల కారణం "నేను-ఇతరులు" అనే స్వార్థపూరిత విభజన ధోరణేనన్నారు. ఇది మానవాళిని పరస్పరం దూరం చేస్తుందని చెప్పారు. "ఈ సమస్యలకు పరిష్కారం అద్వైత తత్వశాస్త్రంలో ఉంది.. అది ద్వంద్వ స్వభావాన్ని ఎంతమాత్రం ప్రబోధించదు" అని ఆయన స్పష్టం చేశారు. అద్వైతమంటే ప్రతి జీవిలో దైవత్వాన్ని చూడటం, యావత్ సృష్టిని దైవిక అభివ్యక్తిగా గ్రహించడంపై నమ్మకమని వివరించారు. ఈ సిద్ధాంతాన్ని పరమహంస దయాళ్ మహారాజ్- "నీవే నేను-నేనే నీవు" అంటూ అత్యద్భుతంగా సరళీకరించారని ఉటంకించారు. "నాది-నీది" అనే వ్యత్యాసాన్ని రూపుమాపే ఈ ఆలోచనలోని విశిష్టతను విశ్వవ్యాప్తంగా అనుసరిస్తే అన్నిరకాల వివాదాలు, విభేదాలు పరిష్కారం కాగలవని స్పష్టం చేశారు.

ప్రథమ పదషాహి శ్రీ పరమహంస దయాళ్ మహారాజ్ బోధనలపై నాలుగో పదషాహి స్వామి శ్రీ విచార పూర్ణానంద్ మహారాజ్తో లోగడ తాను చర్చించడాన్ని ప్రధానమంత్రి ప్రస్తావించారు. అలాగే ఆనంద్‌పూర్ ధామ్ సేవా కార్యక్రమాల గురించి కూడా వివరించారు. ఈ ధామ్‌లో రూపుదిద్దుకున్న ఐదు విశిష్ట ధ్యాన సూత్రాలను ఆయన ప్రముఖంగా ఉటంకిస్తూ- వాటిలో నిస్వార్థ సేవ ఒకటని పేర్కొన్నారు. మానవాళి సేవలో నారాయణ సేవను చూసే భారతీయ సంస్కృతికి పునాది వంటి ఈ నిస్వార్థ సేవా స్ఫూర్తిని ఆయన ప్రస్తావించారు. ఈ సంస్కృతిని ఆనంద్‌పూర్ ట్రస్ట్ అంకితభావంతో కొనసాగించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఈ ట్రస్టు వివిధ ఆస్పత్రుల నిర్వహణ ద్వారా వేలాది రోగులకు చికిత్స సదుపాయం కల్పించడమేగాక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గో సంక్షేమం లక్ష్యంగా ఆధునిక గోశాల ఏర్పాటు చేసిందని, నవతరానికి రూపుదిద్దే పాఠశాలలను నిర్వహిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. మానవాళి సంక్షేమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ఆనంద్‌పూర్ ధామ్ విశేషంగా కృషి చేసిందని ఆయన ప్రశంసించారు. ఈ మేరకు వేలాది ఎకరాల బంజరును పచ్చని పంటల సిరుల భూమిగా మార్చడంలో ఆశ్రమవాసుల కఠోర శ్రమను గుర్తుచేశారు. ఇప్పటిదాకా ఆశ్రమ కార్యక్రమాల ద్వారా నాటిన వేలాది మొక్కలు వృక్షాలుగా ఎదిగి, నిస్వార్థ సామాజిక ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయని వివరించారు.

అలాగే "ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ సేవా స్ఫూర్తికి ప్రాధాన్యం ఉంటుంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రతి పేదకూ ఆహార భద్రత కల్పించడంలో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పోషిస్తున్న పాత్రను ఈ సందర్భంగా ఉదాహరించారు. అదే తరహాలో ఆయుష్మాన్ భారత్ పథకం కూడా పేదలు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ చింతనుంచి విముక్తం చేసిందని, సురక్షిత గృహాల ద్వారా 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' పేదలకు నిలువ నీడ కల్పిస్తున్నదని గుర్తుచేశారు. ఇక గ్రామాల్లో సురక్షిత నీటి సరఫరా సమస్యను జల్ జీవన్ మిషన్ పరిష్కరిస్తోందని పేర్కొన్నారు. రికార్డు సంఖ్యలో కొత్త ఎయిమ్స్, 'ఐఐటీ'లు, 'ఐఐఎం'ల ఏర్పాటుతో పేద పిల్లల కలల సాకారానికి చేయూత లభిస్తున్నదని చెప్పారు. దేశవ్యాప్తంగా 'అమ్మ పేరిట ఓ మొక్క' కార్యక్రమం కింద కోట్లాది మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం తన నిబద్ధత చాటుకుంటున్నదని ప్రధాని పునరుద్ఘాటించారు. ఈ భారీ విజయాలకు కారణం సేవా స్ఫూర్తేనని వ్యాఖ్యానించారు. 'సబ్‌కా సాథ్-సబ్‌కా వికాస్' మంత్ర నిర్దేశంతో పేదలు, అణగారిన వర్గాల సముద్ధరణపై ప్రభుత్వం సంకల్పం పూనిందని ఆయన పునరుద్ఘాటించారు. "ప్రభుత్వ విధానాలు, నిబద్ధతకు ఈ సేవా స్ఫూర్తే మూలం" అని ఆయన స్పష్టం చేశారు.

సేవా సంకల్పం స్వీకరిస్తే, అది ఇతరులకు ప్రయోజనం చేకూర్చడమేగాక స్వీయ వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతూ, మన దృక్పథాన్ని విస్తృతం చేస్తుందని ప్రధానమంత్రి వివరించారు. అంతేకాకుండా సమాజం, దేశం, ఒక్కమాటలో చెబితే- యావత్ మానవాళి శ్రేయస్సుకు దోహదం చేసే విస్తృతాంశాలతో మనను సంధానిస్తుందని తెలిపారు. సేవా నిమగ్నుల అంకిత భావాన్ని ప్రశంసిస్తూ, నిస్వార్థ సేవా కార్యక్రమాల ద్వారా కష్టాలను అధిగమించడం వ్యక్తి రెండో స్వభావం కాగలదని స్పష్టం చేశారు. సేవ ఒక ఆధ్యాత్మిక ఉపకరణమని, అది పవిత్ర గంగాస్నానంతో సమానం కాబట్టి, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అందులో నిమగ్నం కావాలని సూచించారు. దేశ శ్రేయస్సు దిశగా అశోక్ నగర్, ఆనంద్‌పూర్ ధామ్ వంటి ప్రాంతాల కృషిని ప్రస్తావిస్తూ అటువంటి ప్రదేశాలను చక్కగా తీర్చిదిద్దడం ఒక బాధ్యతని అభివర్ణించారు. అందునా ఈ ప్రాంతాల కళ, సంస్కృతి, సహజ సౌందర్యం సుసంపన్న వారసత్వానికి ప్రతీకలని, వారసత్వ సహిత ప్రగతికి దోహదపడటంలో వాటికి అపార సామర్థ్యం ఉందని స్పష్టం చేశారు. దీన్ని గుర్తించిన కారణంగానే మధ్యప్రదేశ్, అశోక్ నగర్‌లలో పురోగమనం ఇనుమడించేలా చేపట్టిన కృషిని ప్రధాని వివరించారు. ఇందులో భాగంగా చందేరి చేనేత కళ ప్రగతి దిశగా చందేరి చీరలకు భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్ సాధించామని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని వేగిరపరచడం లక్ష్యంగా ప్రాణ్‌పూర్‌లో క్రాఫ్ట్ హ్యాండ్లూమ్ టూరిజం విలేజ్ ఏర్పాటు చేశామని చెప్పారు. మరోవైపు మధ్యప్రదేశ్ ప్రభుత్వం 'ఉజ్జయిని సింహస్థ' (కుంభమేళా) నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు.

ఇటీవలి శ్రీరామ నవమి వేడుకలను ప్రస్తావిస్తూ- "రామ వన గమన పథం" (శ్రీరాముని అరణ్యవాస పయనం)లో అధికశాతం మధ్యప్రదేశ్ గుండా వెళ్తుందని పేర్కొన్నారు. ఈ రాష్ట్రానికి ఇదొక అద్భుత, ప్రత్యేకమైన గుర్తింపు కాగా, దీన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు ఆ విశిష్టతను మరింత అపురూపం చేస్తాయని శ్రీ మోదీ తెలిపారు.

భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలన్న జాతి మహా సంకల్పాన్ని ప్రధానమంత్రి పునరుద్ఘాటిస్తూ, దీన్ని సాకారం చేయగలమని సంపూర్ణ ఆత్మవిశ్వాసం ప్రకటించారు. ఈ పయనంలో భాగంగా భారత ప్రాచీన సంస్కృతి పరిరక్షణ అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. పురోగమన పథంలో పయనిస్తూ అనేక దేశాలు తమ సంప్రదాయాలతో సంబంధాన్ని కోల్పోవడం వాస్తవమైనా, భారత్ తన వారసత్వాన్ని కాపాడుకోవడం అవశ్యమని పేర్కొన్నారు. "భారత సంస్కృతి దాని ప్రతిష్ఠతో ముడిపడినది మాత్రమే కాదు... మన సామర్థ్యాన్ని బలోపేతం చేసేదీ ఆ సంస్కృతే"నని పునరుద్ఘాటించారు. ఈ విషయంలో ఆనంద్‌పూర్ ధామ్ ట్రస్ట్ గణనీయంగా కృషి చేసిందని ప్రధానమంత్రి ప్రశంసించారు. ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు వికసిత భారత్ దార్శనికతకు సరికొత్త శక్తినివ్వగలవని విశ్వాసం వెలిబుచ్చారు. బైశాఖి పర్వదినంతోపాటు శ్రీ గురు మహారాజ్ జయంతి వేడుకల సందర్భంగా మరోసారి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన తన ప్రసంగం ముగించారు.

మధ్యప్రదేశ్ గవర్నర్ శ్రీ మంగుభాయ్ పటేల్, ముఖ్యమంత్రి శ్రీ మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేపథ్యం

ఆనంద్‌పూర్ ధామ్ ఆధ్యాత్మిక, సామాజిక ప్రయోజనాలు లక్ష్యంగా రూపుదిద్దుకున్న ధార్మిక సంస్థ. ఇది 315 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు కాగా, ఇక్కడి అత్యాధునిక గోశాలలో 500కుపైగా గోవులు ఆశ్రయం పొందుతున్నాయి. ఈ ప్రాంగణంలో వ్యవసాయ కార్యకలాపాలు కూడా కొనసాగుతుంటాయి. అంతేగాక సామాజిక సేవలో భాగంగా సుఖ్‌పూర్ గ్రామంలో ఒక ధార్మిక ఆస్పత్రి, సుఖ్‌పూర్తోపాటు ఆనంద్‌పూర్‌లో పాఠశాలలు సహా దేశవ్యాప్తంగా వివిధ సత్సంగ్ కేంద్రాలను కూడా ఈ ట్రస్టు నిర్వహిస్తోంది.




# 'ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్'ను అమలు చేస్తున్నందుకు ఢిల్లీ ప్రభుత్వానికి ప్రధానమంత్రి ప్రశంసలు

నల్గొండ, ఏప్రిల్ 12:'ప్రధాన్‌మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్' (పీఎమ్-ఏబీహెచ్ఐఎమ్)ను అమలుచేస్తున్నందుకూ, 'ప్రధాన్‌మంత్రీ జన్ ఆరోగ్య యోజన' (పీఎమ్-జేఏవై)లో భాగంగా ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీని మొదలు పెట్టినందుకూ ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి ఎక్స్‌లో పొందుపరిచిన ఒక సందేశానికి శ్రీ మోదీ ప్రతిస్పందిస్తూ ఇలా పేర్కొన్నారు:"ఢిల్లీ ఆరోగ్య రంగంతో ముడిపడ్డ ఒక విప్లవాత్మక నిర్ణయం! డబల్ ఇంజన్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ మిషన్ ఇక్కడి నా లక్షలాది సోదర, సోదరీమణులకు ఎంతో ప్రయోజనకరం కానుంది. ఢిల్లీ వాసులు సైతం ఇక ఆయుష్మాన్ యోజనలో భాగంగా చికిత్సలు చేయించుకోగలుగుతారు."

# వైభవంగా ముగిసిన శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు



తిరుపతి, ఏప్రిల్ 12: తిరుమల శ్రీవారి ఆలయం వెనుక వైపు గల వసంతోత్సవ మండపంలో గత మూడురోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన సాలకట్ల వసంతోత్సవాలు శనివారం కన్నులపండుగగా ముగిశాయి. తొలిరోజు, రెండవరోజు శ్రీ మలయప్పస్వామివారు తన ఉభయ దేవేరులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొనగా, చివరిరోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పతో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వారు , శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు వసంతోత్సవ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది.

మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఒకే వేదికపై సమస్త మూలవరులను దర్శించిన భక్తులు తన్మయత్వం తో పులకించారు. అదేవిధంగా ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడసేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి శ్రీ విష్ణుదేవ్ సాయ్‌తో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:గనుల కార్యకలాపాలను సమీక్షించడానికి, సీఎస్ఆర్ కార్యక్రమాలను అంచనా వేయడానికి, రాష్ట్ర అధికారులతో సమన్వయాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి రెండు రోజుల సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) పర్యటన చేపట్టారు. బొగ్గు ఉత్పత్తిని పెంచడం, సుస్థిర మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం, ఈ ప్రాంతంలో సమగ్ర అభివృద్ధిని సాధించడం ఈ పర్యటన ఉద్దేశం.

చత్తీస్ గఢ్ పర్యటనలో భాగంగా రెండో రోజు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ విష్ణుదేవ్ సాయ్ తో శ్రీ కిషన్ రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మైనింగ్ ఆధారిత ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, గనుల విస్తరణ కోసం భూసేకరణను వేగవంతం చేయడం, పర్యావరణ అనుమతులను వేగవంతం చేయడం, సమీకృత పునరావాసం, పునరావాస స్థలాల అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చించారు. చత్తీస్ గఢ్ లో కీలకమైన ఖనిజాభివృద్ధి వ్యూహాత్మక ప్రాముఖ్యత కూడా ఈ చర్చలో ప్రధానాంశంగా నిలిచింది.

ఈ సమావేశంలో చత్తీస్ గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమితాబ్ జైన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, బొగ్గు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి బి.పి.పాటి, కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ పీఎం ప్రసాద్, ఎస్ఈసీఎల్ సీఎండీ హరీశ్ దుహన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.

కేంద్రమంత్రి శ్రీ కిషన్ రెడ్డి అంతకుముందు ఎస్ఈసీఎల్ ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ కార్యక్రమం 'ఎస్ఈసీఎల్ కే సుశ్రుత్' ద్వారా మద్దతు పొందుతున్న నీట్ అభ్యర్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. బొగ్గు గనుల ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ పథకం కింద ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌ను అందిస్తారు. వారు తమ వైద్య విద్య లక్ష్యాలను సాధించేందుకు ఈ పథకం తోడ్పడుతుంది. విద్యార్థుల విజయాలను మంత్రి అభినందించారు. బొగ్గు గనుల ప్రదేశాల్లోని యువతకు విద్య అవకాశాలను పెంపొందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.రాయ్పూర్ లోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో, పుట్టుకతో వచ్చే గుండె లోపాలకు (సీహెచ్డీ) ఉచిత చికిత్స, శస్త్రచికిత్సలను అందించే సీఎస్ఆర్ కార్యక్రమం 'ఎస్ఈసీఎల్ కి ధడ్కాన్' యువ లబ్ధిదారులతోనూ, వారి కుటుంబాలతోనూ కేంద్రమంత్రి సమావేశమయ్యారు. ప్రజల ప్రాణాలను రక్షించే దిశగా ఎస్ఈసీఎల్ తీసుకుంటున్న కార్యక్రమాలను ప్రశంసించారు. అలాగే, ఆరోగ్య సేవలు, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వ బొగ్గు రంగ సంస్థలు (పీఎస్యూలు ) ప్రభావవంతమైన చొరవలతో సహకారం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు.

ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అధికారులతో నిర్వహించిన మరో సమీక్షా సమావేశంలో, ప్రస్తుతం జరుగుతున్న అన్వేషణ కార్యకలాపాలు, సర్వే పురోగతిని కేంద్రమంత్రి సమీక్షించారు. అధునాతన అన్వేషణ, మెరుగైన సమన్వయం ద్వారా చత్తీస్ గఢ్ లో ఖనిజ సామర్థ్యాన్ని వెలికితీసే వ్యూహాలపై చర్చించారు.

బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి పర్యటన సమగ్ర, సుస్థిర అభివృద్ధి కోసం మైనింగ్ సామర్థ్యాన్ని ఉపయోగించడానికి ప్రభుత్వ బలమైన నిబద్ధతను తెలియచేస్తుంది. సుస్థిరత, సామాజిక సమానత్వం, ప్రాంతీయ పురోగతి వంటి జాతీయ ప్రాధాన్యాలతో బొగ్గు రంగ వృద్ధిని సమీకృతం చేయాలన్న స్పష్టమైన దార్శనికతను ఇది ప్రతిబింబిస్తుంది. ఖనిజ అన్వేషణను వేగవంతం చేయడం మొదలుకొని ఔత్సాహిక యువతకు సాధికారత కల్పించడం, ఆరోగ్య సంరక్షణ ద్వారా ప్రాణాలను కాపాడటం వరకు క్షేత్రస్థాయి ప్రభావంతో ప్రభుత్వ విధానాన్ని అనుసంధానించడం ద్వారా బొగ్గు గనుల ప్రాంతాలను సౌభాగ్యం, ప్రతికూలతలను ఎదుర్కొనే సామర్థ్యం, సమగ్ర అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలనే ప్రభుత్వ అచంచల సంకల్పాన్ని ఈ పర్యటన పునరుద్ఘాటించింది.

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి- ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఆదిలాబాద్, ఏప్రిల్ 12: తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో హనుమాన్ ఆలయం చుట్టూ 6లక్షల పైచిలుకు నిధులతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూమన్న భూషణ్, ఆలయ కమిటీ చైర్మన్ కె.దినకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ కడెం మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తక్కళ్ళ సత్తన్న, ఆకుల లచ్చన్న, కోల శ్రీనివాస్, కె రాజేష్, మార్కాపు లక్ష్మణ్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు అంజన్న స్వామి, మాలదారులు, తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడలో కలుషిత నీరు కలకలం..

హైదరాబాద్, ఏప్రిల్ 12: బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కలుషిత నీరు గత కొన్ని రోజులుగా కలకలం రేపుతుంది. గతంలో అనేక మార్లు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కూడా అదే కలుషిత నీరు రావడంతో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఫిబ్రవరి నెలలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సమస్యను పరిష్కరిం చేందుకు హిమాయత్ సాగర్ నుంచి నీటిని పంపిణీ చేసేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రారంభిం చారు. కాగా అధికారుల నిర్లక్ష్యంతో నీటి శుద్ధి యంత్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రజలకు మంచినీటికి బదులుగా కలుషితనీరు వస్తుంది.విషయము తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు రావుల కోళ్ల నాగరాజు ఇతర నాయకులతో అక్క డికి చేరుకొని సమస్యను పరిశీలి ంచారు. అనంతరం జలమం డలి మేనేజర్ శ్రీనివాస్‌తో ఆ నీటిని శుద్ధి మీటర్‌తో పరిశీలించారు. అక్కడ నిజంగానే కలుషిత నీరు వస్తున్నాయని గ్రహించిన అధికారి ఇకమీదట కలుషిత నీరు రాకుండా చర్యలు తీసు కుంటామని ప్రజలకు హా మీ ఇచ్చారు.

# అవకాశాలు సహా సామర్థ్యానికి, విజయాలకు ఉత్తరప్రదేశ్ ప్రతీక: ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:ఈ రోజు ఉత్తరప్రదేశ్ వారణాసిలో రూ. 3,880 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, కాశీ నగరంతో తనకు గల గాఢానుబంధాన్ని గురించిన అనుభూతులను పంచుకున్నారు. తన కుటుంబ సభ్యులు, ప్రాంత ప్రజలు తనకు అందించిన ఆశీస్సులకు, తనపై కురిపించే ఆదరాభిమానాలకు శ్రీ మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలందించే ప్రేమ తనను రుణగ్రస్తుడిని చేసిందని, తాను కాశీకి, కాశీ తనకు చెందుతుందన్నారు. రేపు హనుమాన్ జన్మోత్సవమని గుర్తు చేస్తూ, కాశీలోని సంకట మోచన మహారాజ్ ను సందర్శించే గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. హనుమాన్ జన్మోత్సవ పావన సందర్భాన్ని జరుపుకోవడానికి ముందస్తుగా అభివృద్ధిని వేడుక చేసుకునేందుకు కాశీ ప్రజానీకం తరలి రావడం హర్షదాయకమన్నారు.

"గత దశాబ్ద కాలంలో వారణాసి అభివృద్ధి వేగం పుంజుకుంది" అని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఈ నగరం ఆధునికతను అలవర్చుకుంటూనే వారసత్వాన్ని కాపాడుకుంటూ వెలుగులీనే భవిష్యత్తుకు సంసిద్ధమవుతోందన్నారు. పూర్వాంచల్ ఆర్థిక చిత్రంలో కేంద్రస్థానం దక్కించుకున్న కాశీని ఇక పురాతన నగరంగా కాక, ప్రగతిశీల నగరంగా గుర్తించవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కాశీ విశ్వేశ్వరుడు పూన్చిన అభివృద్ధి రథాన్ని అధిరోహిస్తున్న కాశీ, పూర్వాంచల్ ను ఆ బాటపై ముందుకు తీసుకువెళుతోందని వ్యాఖ్యానించారు.

కాశీ, పూర్వాంచల్ లోని ప్రాంతాలకు సంబంధించి నేడు ప్రారంభించిన పలు అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా రహదారి అనుసంధానం బలపడుతుందని, ప్రతి ఇంటికీ నీటి వసతి కల్పించాలన్న ఆశయం నెరవేరగలదని, విద్య, ఆరోగ్యం, క్రీడా సదుపాయాలు మెరుగవుతాయని చెప్పారు. పూర్వాంచల్ ను అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడంలో భాగంగా యువతకు, ప్రతి ప్రాంతానికి, కుటుంబానికి మెరుగైన వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. తాము ప్రవేశపెడుతున్న పథకాల ద్వారా ప్రతి కాశీ పౌరుడూ లబ్ధి పొందగలడంటూ వారణాసి, పూర్వాంచల్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు జ్యోతిబా పూలే జయంతి సందర్భాన్ని గుర్తు చేసుకున్న ప్రధాని... మహిళా సాధికారత, ఆత్మ విశ్వాస పెంపు, సమాజ సంక్షేమానికి మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలేలు తమ జీవితాలను అంకితం చేశారని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు తాము చేస్తున్న కృషిని ఈ సందర్భంగా వివరించారు. తమ ప్రభుత్వం 'సబ్కా సాథ్, సబ్కా వికాస్' అనే సూత్రాన్ని నమ్మి ఆచరిస్తోందని స్పష్టం చేశారు. పూర్వాంచల్ లో పశువులను పెంచుతున్న కుటుంబాలను అభినందించిన శ్రీ మోదీ, ఈ పనిలో ఎంతో శ్రమిస్తున్న మహిళలు ఈ ప్రాంతానికే స్ఫూర్తిదాతలుగా ఉన్నారని కొనియాడారు. ఈ మహిళలపై ఉంచిన విశ్వాసం అద్భుతమైన ఫలాలను ఇచ్చి, చరిత్ర సృష్టించిందని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ బనాస్ పాల ఉత్పత్తి కేంద్రంతో అనుబంధమున్న పశువుల పెంపకందారులకు బోనస్ సొమ్మును బదిలీ చేసే అంశాన్ని ప్రధాని ప్రస్తావించారు. రూ. 100 కోట్లకు పైగా బోనస్ రూపంలో పంపిణీ చేసిన సొమ్ముని బహుమతిగా అందించలేదని, వారి నిబద్ధతకు, శ్రమకి గుర్తింపుగా అందజేశామని అన్నారు. శ్రమ, పట్టుదల వెలకట్టలేనివని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

పూర్వాంచల్ లో నివసించే మహిళలు ఒకప్పుడు ఉపాధి గురించి చింతిస్తే, నేడు వారే "లఖ్ పతీ దీదీలు' గా మారి ప్రగతి మార్గంలో పయనిస్తున్నారన్నారు. బనాస్ డైరీ... కాశీలో నివసించే వేలాది మంది కుటుంబాల్లో, నగర ముఖచిత్రంలో పరివర్తనకు మూలమని శ్రీ మోదీ అన్నారు. శ్రమకు తగిన గుర్తింపునిచ్చిన బనాస్ డైరీ, కాశీవాసుల ఆశలకు, ఆశయాలకు రెక్కలు తొడిగిందన్నారు. ఇటువంటి ప్రగతి ఈ ప్రాంతానికే పరిమితమవలేదని, దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఈ మార్పుని స్పష్టంగా గమనించవచ్చని చెప్పారు. "పాల ఉత్పత్తిలో నేడు భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉంది. గత దశాబ్దంలోనే పాల ఉత్పత్తిలో 65 శాతం వృద్ధి నమోదైంది" అని చెప్పారు. లక్షలాది మంది రైతులు, పశు పోషకులు గత పదేళ్ళుగా చేసిన కృషి వల్లే ఈ ఘనత సాధ్యమైందని కితాబిచ్చారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటి అమలుని వేగవంతం చేసిందని చెబుతూ, పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులను అందించి, రుణ మొత్తాన్నీ పెంచామని, సదుపాయాలను మెరుగుపరిచామని, పలు రాయితీలు కల్పించామని వివరించారు. పశువుల్లో తీవ్ర ఇబ్బందులను కలిగించే ఫుట్ అండ్ మౌత్ వ్యాధి కట్టడికి ఉచిత టీకా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రధానమంత్రి వెల్లడించారు.

పాల సేకరణ క్రమ పద్ధతిలో సాగేందుకు 20,000 పాడి సహకార సమాఖ్యల పునరుద్ధరణ పనులు చేపట్టిన ప్రభుత్వం, లక్షలాది మంది కొత్త సభ్యులతో సమాఖ్యల పరిపుష్టికి కృషి చేసిందని చెప్పారు. దేశవాళీ పశుజాతుల అభివృద్ధిపై దృష్టి సారించాలన్న ప్రధాని, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా మేలిమి జాతుల పెంపకం కోసం శాస్త్రీయమైన పద్ధతులు అవలంబించాలని సూచించారు. తాము ప్రవేశపెట్టిన పథకాలు పశుపోషకులకు మెరుగైన అవకాశాలు, కొత్త మార్కెట్లు, కొత్త అభివృద్ధి అవకాశాలను కల్పించేందుకు ఉద్దేశించినవని శ్రీ మోదీ వివరించారు. పూర్వాంచల్ ప్రాంతంలో అభివృద్ధి ఆశయాన్ని వ్యాప్తి చేసినందుకు బనాస్ డైరీ కాంప్లెక్సుకు ప్రధాని అభినందనలు తెలియజేశారు. డైరీ ఈ ప్రాంతంలో మేలు జాతి గిర్ ఆవులను పాడి రైతులకు అందించిందని, వాటి సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో అవసరమైన గ్రాసాన్ని అందించేందుకు వారణాసిలో ఏర్పాట్లు ప్రారంభించిందని అభినందనలు తెలియజేశారు. పూర్వాంచల్ లోని లక్షమందికి పైగా పాడి రైతుల నుంచి పాలను సేకరిస్తున్న బనాస్ డైరీని ప్రశంసించిన శ్రీ మోదీ, పాడి రైతుల సాధికారతకు, వారి జీవనోపాధి మెరుగుదలకు ఈ చర్య దోహదపడుతోందన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఆయుష్మాన్ వయో వందన కార్డులను పంపిణీ చేయడం తనకు దక్కిన విశిష్ట అవకాశమని ప్రధానమంత్రి అన్నారు. వారి ముఖాల్లో కనిపిస్తున్న సంతృప్తి.. ఈ పథకం విజయవంతం అయిందనడానికి నిదర్శనమని తెలిపారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల కుటుంబసభ్యులకున్న ఆందోళనల గురించి తెలియజేస్తూ.. 10-11 ఏళ్ల క్రితం పూర్వాంచల్‌లో వైద్య సేవలు పొందడానికి ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. "ప్రస్తుతం కాశీ ఆరోగ్య రాజధానిగా మారింది" అంటూ ఈ ప్రాంతంలో సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. అధునాతన సౌకర్యాలున్న ఆసుపత్రులు ఒకప్పుడు ఢిల్లీ, ముంబయి లాంటి నగరాలకు మాత్రమే పరిమితమై ఉండేవని, ఇప్పుడు ప్రజల ఇళ్లకు చేరువలో ఉన్నాయని పేర్కొన్నారు. పౌరులకు అవసరమైన సదుపాయాలను వారికి అందుబాటులోకి తీసుకురావడమే అభివృద్ధి సారాంశమని చెప్పారు.

గడచిన దశాబ్దంలో ఆరోగ్యరంగంలో సాధించిన గణనీయమైన పురోగతి గురించి మాట్లాడుతూ ఆసుపత్రుల సంఖ్యను పెంచడమే కాకుండా.. రోగుల గౌరవాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం పేదలకు వరం లాంటిదని, ఇది రోగులకు అవసరమైన చికిత్సను అందించడమే కాకుండా.. వారిలో విశ్వాసాన్ని నింపుతోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా వారణాసికి చెందిన వేల మంది, ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ప్రయోజనం పొందుతున్నారు. దీని ద్వారా అందే వైద్యసహాయం, శస్త్ర చికిత్స, ఉపశమనంతో వారి జీవితాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని లక్షలాది కుటుంబాలకు కోట్ల రూపాయలు ఆదా అయినట్లు వెల్లడించారు. వృద్ధులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని తాను ఇచ్చిన హామీ ఆయుష్మాన్ భారత్ వయో వందన పథకానికి దారి తీసిందని చెప్పారు. ఇది 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ వారి ఆదాయంతో సంబంధం లేకుండా ఉచిత చికిత్స అందిస్తుందని తెలిపారు. వారణాసిలో అత్యధికంగా 50,000 వయో వందన కార్డులు పంపిణీ అయ్యాయని తెలిపారు. ఇది కేవలం సంఖ్య మాత్రమే కాదని, ఆరోగ్య సేవలను అందించడంలో అంకిత భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. చికిత్స కోసం భూమిని అమ్మడం, రుణాలు తీసుకోవడం లేదా నిస్సహాయ స్థితిలో మిగిలిపోకుండా సహాయపడుతోందని తెలియజేశారు. ఆయుష్మాన్ కార్డుల ద్వారా వారి వైద్య సేవలకు అవసరమైన ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పనతో కాశీలో సాధించిన గణనీయమైన మార్పుల గురించి ప్రధాని ప్రముఖంగా వివరించారు. ఇది సందర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంటోందని తెలిపారు. ప్రతి రోజూ లక్షల సంఖ్యలో వారణాసిని సందర్శిస్తారని, పవిత్ర గంగానదిలో స్నానమాచరించి, బాబా విశ్వనాథుడిని ప్రార్థిస్తారన్నారు. వారిలో చాలా మంది కాశీలో వచ్చిన మార్పులను ప్రత్యేకంగా మెచ్చుకుంటున్నారని తెలిపారు. కాశీలో రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయం పదేళ్ల క్రితం ఉన్నట్టుగానే ఇప్పుడూ ఉంటే.. ఈ నగరం ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చి ఉండేదని అభిప్రాయపడ్డారు. చిన్న పండగలకు సైతం ట్రాఫిక్ జామ్ అయ్యేదని, వేడి, దుమ్మును భరిస్తూనే సందర్శకులు మొత్తం నగరం చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. ఫూల్వారియా ఫ్లైఓవర్ నిర్మాణం దూరాన్ని తగ్గించి, సమయం ఆదా చేస్తోందని, రోజువారీ ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనాన్ని తీసుకొచ్చిందని అన్నారు. రింగ్ రోడ్డు ప్రయోజనాలను సైతం ప్రధానమంత్రి తెలిపారు. జౌన్‌పూర్, ఘాజీపూర్ గ్రామీణ ప్రాంత వాసులకు, బల్లియా, మవు, ఘాజీపూర్ జిల్లాల నుంచి ఎయిర్‌పోర్టుకు చేరుకొనేందుకు ప్రయాణ సమయం, ట్రాఫిక్ రద్దీని తగ్గించిందని తెలిపారు.

ఘాజీపూర్, జౌన్‌పూర్, మిర్జాపూర్, అజాంఘడ్ తదితర నగరాలకు త్వరగా, సౌకర్యవంతంగా చేరుకొనేలా ఈ ప్రాంతంలో మెరుగైన రవాణా సదుపాయాలు, విస్తరించిన రహదారుల గురించి శ్రీ మోదీ వివరించారు. గతంలో ట్రాఫిక్ రద్దీతో సతమతమైన ఈ ప్రాంతాలు ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గడచిన దశాబ్దంలో వారణాసి, చుట్టుపక్కల ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు రూ.45,000 కోట్లు పెట్టుబడి పెట్టామని తెలిపారు. ఈ పెట్టుబడులు.. మౌలిక సదుపాయాలతో పాటు నమ్మకాన్ని కూడా పెంచాయని, కాశీతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు లబ్ధి చేకూర్చాయని ఆయన పేర్కొన్నారు. వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టుల విస్తరణను ఆయన ప్రకటించారు. ప్రస్తుతం జరుగుతున్న లాల్ బహదూర్ శాస్త్రి విమానాశ్రయ విస్తరణ పనులు, ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేలా చేపడుతున్న ఆరు లైన్ల సొరంగ మార్గ నిర్మాణం పనుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. భదోహి, ఘజియాపూర్, జౌన్‌పూర్‌లను అనుసంధానించే వివిధ ప్రాజెక్టులతో పాటు బిఖారీపూర్, మండౌడియాలో దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఫ్లైఓవర్ల నిర్మాణ ప్రారంభాన్ని కూడా గుర్తు చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారణాసి నగరాన్ని సారనాథ్‌తో కలిపేలా కొత్త వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులు సారనాథ్ చేరుకోవాలంటే నగరంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రానున్న నెలల్లో కాశీకి చేరుకోవడం మరింత సులభమవుతుందని, అభివృద్ధి ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలను పెంచుతుందని అన్నారు. జీవనాధారం, ఆరోగ్యసేవల నిమిత్తం వారణాసికి వచ్చే వారికి ప్రయాణ సౌలభ్యాన్ని పెంచుతుందన్నారు. కాశీలో రోప్‌వే ఏర్పాటు చేసే ప్రయత్నాలు ప్రారంభమైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఈ సౌకర్యం ఉన్న నగరాల్లో కాశీ కూడా ఒకటిగా నిలుస్తుందని తెలిపారు.

వారణాసిలో చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్వాంచల్ యువతకు లబ్ధి చేకూరుస్తాయని శ్రీ మోదీ అన్నారు. కాశీ యువత క్రీడల్లో రాణించేలా నిరంతర అవకాశాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. యువ అథ్లెట్ల కోసం కాశీలో నిర్మిస్తున్న వివిధ స్టేడియాలు, ఎక్స్ లెన్స్ కేంద్రాల గురించి తెలియజేశారు. వారణాసికి చెందిన వందల మంది క్రీడాకారు?లు శిక్షణ పొందుతున్న కొత్త స్పోర్ట్స్ కాంప్లెక్స్ గురించి ప్రధాని గుర్తు చేశారు. ఎంపీ క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఈ మైదానాలపై తమ ప్రతిభను చూపించే అవకాశం దొరికిందని అన్నారు.

అభివృద్ధి, వారసత్వాన్ని సమతౌల్యం చేస్తూ సాగిస్తున్న భారత్ ప్రయాణం గురించి తెలియజేస్తూ.. దీనికి కాశీని అత్యుత్తమ ఉదాహరణగా పేర్కొన్నారు. గంగా ప్రవాహం, భారతీయ చైతన్యం గురించి వివరిస్తూ "దేశ ఆత్మను, వైవిధ్యాన్ని అందంగా చూపించే చిత్తరువు కాశీ'' అని వర్ణించారు. కాశీలోని ప్రతి ఇంట్లో ప్రత్యేకమైన సంస్కృతి, భారతీయతలోని వైవిధ్యం ప్రతిబింబిస్తుందని అన్నారు. కాశీ-తమిళ సంగమం లాంటి కార్యక్రమాలు దేశ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. దేశ వైవిధ్యాన్నంతా ఒకే చోట ప్రదర్శించేలా కాశీలో నిర్మించనున్న ఏక్తామాల్ గురించి వివరించారు. ఇది వివిధ జిల్లాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది.

ఇటీవల కొన్నేళ్లలో ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకొన్న ప్రగతిని ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ, ఈ రాష్ట్రం తన ఆర్థిక ముఖచిత్రంతో పాటు తన దృష్టి కోణాన్ని కూడా మార్చుకొందన్నారు. ఉత్తరప్రదేశ్ ఇక అవకాశాల నేల మాత్రమే కాదని, సామర్థ్యాలు, విజయాల నిలయంగా కూడా ఈ రాష్ట్రం మారిపోయిందని ఆయన అన్నారు. 'మేడ్ ఇన్ ఇండియా'కు ప్రపంచమంతటా ఆదరణ లభిస్తోందని ఆయన చెబుతూ.. భారత్‌లో రూపొందుతున్న ఉత్పాదనలు ప్రస్తుతం గ్లోబల్ బ్రాండ్లుగా పేరుతెచ్చుకొంటున్నాయని తెలిపారు. అనేక ఉత్పాదనలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగులను సంపాదించుకొన్న సంగతిని ఉదాహరిస్తూ, ఈ ట్యాగులు ఉత్త లేబుళ్లే కాదు.. ఇవి అంతకు మించినవనీ, ఇవి ఈ నేలకు గుర్తింపు లభించినట్లు సూచించే ధ్రువపత్రాలుగా ప్రధాని అభివర్ణించారు. ఏదైనా ఒక ఉత్పాదన ఫలానా ప్రాంతంలో ప్రత్యేకంగా తయారైందని జీఐ ట్యాగులు చెబుతుంటాయని, జీఐ ట్యాగ్ చేరుకొన్న ప్రాంతంలో ఈ ట్యాగులు మరింత ఎక్కువ వాణిజ్యాత్మక విజయానికి బాటలువేస్తాయని ఆయన వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా జీఐ ట్యాగింగులో ఉత్తరప్రదేశ్ నాయకత్వ స్థితిని చేజిక్కించుకుందని శ్రీ మోదీ స్పష్టం చేస్తూ, రాష్ట్ర కళలకు, చేతివృత్తి ఉత్పాదనలకు, నైపుణ్యాలకు అంతరాజతీయంగా గుర్తింపు లభించడం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. వారణాసి, వారణాసి చుట్టుపక్కల ప్రాంతాల్లో తయారవుతున్న 30కి పైగా ఉత్పాదనలకు జీఐ ట్యాగులు లభించాయని, జీఐ ట్యాగులు ఈ ఉత్పాదనలకు పాస్‌పోర్టు లాంటివంటూ చమత్కరించారు. వారణాసి తబలా, షెహనాయి, గోడలకు అలంకరించే పెయింటింగులు, ఠండాయి (చల్లని పానీయాలు), భర్వాన్ లాల్ మిర్చ్, లాల్ పేడా, తిరంగా బర్ఫీ వంటి జీఐ గుర్తింపు పొందిన ఈ ప్రాంత ఉత్పాదనలను కొన్నింటిని ఆయన ఉదాహరించారు. ఈమధ్యే జీఐ ట్యాగులను సంపాదించిన జౌన్‌పూర్ ఇమార్తీ, మథుర సాంఝీ కళ, బుందేల్‌ఖండ్ కఠియా గోధుమ, పీలీభీత్ వేణువు, ప్రయాగ్‌రాజ్ మూంజ్ గడ్డిని ఉపయోగించి అల్లే బుట్టలు, గోడకు వేలాడదీసే అలంకరణ వస్తువులు, ఇతరత్రా ఉత్పాదనలు, బరేలీ జర్‌దోజీ, చిత్రకూట్ కలప ఉత్పాదనలు, లఖీంపుర్ ఖీరీకి చెందిన థారూ జర్‌దోజీ వగైరా ఉత్పాదనలను కూడా ఆయన ప్రస్తావించారు. "ఉత్తరప్రదేశ్ మట్టి పరిమళం ఇప్పుడు సరిహద్దులను దాటిపోయి, తన వారసత్వాన్ని బహుదూర ప్రాంతాలకు వ్యాప్తి చేస్తోంద"ని ఆయన అన్నారు.

కాశీని పరిరక్షించుకోవడం అంటే భారత్ ఆత్మను రక్షించడమే అని ప్రధాని వ్యాఖ్యానించారు. కాశీని నిరంతరం శక్తిమంతంగా నిలపడం, దీని శోభను చెక్కుచెదరనీయకపోవడం, దీని ప్రాచీన భావనను ఆధునిక గుర్తింపుతో పెనవేయాలనే సామూహిక నిబద్ధతను కనబరచాలని ప్రధానంగా చెబుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ గవర్నరు శ్రీమతి ఆనందీబెన్ పటేల్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ సహా ఇతరులు పాల్గొన్నారు.

నేపథ్యం

వారణాసిలో రూ. 3,880 కోట్లకు పైగా ఖర్చయ్యే వివిధ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వారణాసిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ముఖ్యంగా రహదారి సంధానాన్ని పెంచుతానన్న తన వాగ్దానానికి అనుగుణంగానే ఈ ప్రాంతంలో వివిధ రహదారి ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు... మరికొన్నింటికి శంకుస్థాపనలు కూడా చేశారు. వీటికి అదనంగా, వారణాసి రింగ్ రోడ్డు, సార్‌నాథ్‌ల మధ్య ఒక రోడ్డు బ్రిడ్జి, నగరంలోని భిఖారీపూర్, మండువాడీహ్ క్రాసింగ్‌పై ఒక ఫ్లయ్ ఓవర్‌ల తోపాటు వారణాసి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఎన్‌హెచ్-31లో రూ. 980 కోట్లకు పైచిలుకు వ్యయమయ్యే ఒక హైవే అండర్‌పాస్ రోడ్ టన్నెల్ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు.

విద్యుత్తు రంగ మౌలిక సదుపాయాల కల్పనకు దన్నుగా నిలిచేలా వారణాసి డివిజన్‌లోని జౌన్‌పూర్, చందౌలీ, గాజీపూర్ జిల్లాలలో రూ. 1,045 కోట్లకు పైగా ఖర్చయ్యే రెండు 400 కేవీ, ఒక 220 కేవీ ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్‌లతో పాటు సంబంధిత విద్యుత్తు సరఫరా లైన్లను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. వారణాసిలో చౌకాఘాట్‌లో 220 కేవీ ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్, గాజీపూర్‌లో 132 కేవీ ట్రాన్స్‌మిషన్ సబ్‌స్టేషన్‌లతోపాటు వారణాసి నగరంలో రూ. 775 కోట్లకు పైచిలుకు వ్యయంతో విద్యుత్తు పంపిణీ వ్యవస్థ విస్తరణ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు.

భద్రతాసిబ్బందికి మెరుగైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి పోలీస్ లైన్‌లో ట్రాన్సిట్ హాస్టల్, పీఏసీ రాంనగర్ క్యాంపస్‌లో బ్యారక్స్‌ను ప్రధాని ప్రారంభించారు. అనేక పోలీస్ ఠాణాలలో కొత్త పరిపాన భవనాలకు, పోలీస్ లైన్‌లో రెసిడెన్షియల్ హాస్టల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు.

విద్యా ఫలాలు అందరికీ అందేటట్లు చూడాలన్న తన దృష్టికోణానికి అనుగుణంగా ప్రధానమంత్రి పిండ్‌రాలో ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బర్కీ గ్రామంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రభుత్వ కళాశాల, 356 గ్రామీణ గ్రంథాలయాలు, 100 ఆంగన్‌వాడీ కేంద్రాలు సహా అనేక పథకాలను ప్రారంభించారు.

# కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభంజనం

కర్నూలు ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షల ఫలితాల్లో కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఉత్తమ ఫలితాలతో రాష్ట్రంలోనే మెరుగైన స్థానంలో నిలిచారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని కర్నూలు టౌన్ మోడల్ కు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థిని బండి పావని ఎంపీసీ గ్రూపులో 1000 కి 986 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోనే టాపర్ గా నిలిచారు.

అలాగే ఒకేషనల్ కోర్సులో ఇదే కళాశాలకు చెందిన వి.తేజస్విని 1000 / 986 మార్కులతో ఉత్తీర్ణత సాధించి టాపర్ గా నిలిచారు. ఇక ఇదే కళాశాలకు చెందిన జోష్ణ ఎంపీసీలో 975, లక్ష్మీ లలితా రాణి ఎంపీసీ గ్రూపులో 977, బైపీసీలో డి.నందిని 980, రేణు విజయ 978, కామర్స్ గ్రూపులో జే.కళ్యాణ్ 901, సుజాత 851 ఉత్తమమైన మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.. వీరిని కర్నూల్ ఆర్ఐఓ ఎస్ వి ఎస్ గురువయ్య శెట్టి, కర్నూల్ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.సుంకన్న, లెక్చరర్స్ సురేష్ చంద్ర, శ్రీకాంత్, రహిమాన్, శ్రీనివాసులు, రాజు నాయక్, తదితరులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో కర్నూల్ నగరంలోని కల్లూరు చెందిన బండి పావని 1000 / 986 మార్కులతో జిల్లాలోని టాపర్ గా నిలిచారు. ఎంపీసీ గ్రూప్ లో ఆమె ఈ ఫలితాలను సాధించగలిగారు.. నిరుపేద కుటుంబంలో జన్మించిన బండి పావని తండ్రి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం లేవగానే ఆటో నడుపుకుంటే తప్ప అతని కుటుంబం గడిచేది కాదు. అయితే ఎంత కడుపేదరికంలో ఉన్నా తనకున్న ఇద్దరు కుమార్తెలను బాగా చదివిస్తూ వచ్చాడు. ఒకటి నుంచి పదవ తరగతి వరకు పిల్లలను ప్రభుత్వ బడిలోనే పావని తల్లిదండ్రులు చదివిస్తూ వచ్చారు. ఈక్రమంలోనే పావని అక్క 10, ఇంటర్ లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, ప్రస్తుతం బీటెక్ విద్యను అభ్యసిస్తున్నారు. చిన్నతనం నుంచి విద్యలో అక్క కనబరుస్తున్న ప్రతిభను ఆదర్శంగా తీసుకున్న పావని కూడా 10 ఫలితాల్లో మంచి మార్కులు తెచ్చుకుని కర్నూల్ టౌన్ మోడల్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తూ వచ్చారు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన పావని ద్వితీయ సంవత్సరంలో కూడా అదే స్థాయిలో మంచి మార్కులు సాధించి జిల్లాలోని ఉత్తమ విద్యార్థినిగా నిలిచారు. 1000 కి 986 మార్కులు సాధించడం గమనార్హం. పెద్ద కుమార్తె కన్నా చిన్న కుమార్తె చదువులో మరింత రాణించి ఏకంగా జిల్లా స్థాయిలోనే టాప్ గా నిలవడం ఆటోవాలా అయినా బండి పావని తల్లిదండ్రులకు ఆనందం కలిగించింది. తమ పెద్ద కుమార్తె వల్లే చిన్న కుమార్తె కూడా ఇంటర్ ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించి తమ పేరును రాష్ట్రస్థాయిలో నిలిపినందుకు వారి కళ్ళలో ఆనందభాష్పాలు చెమ్మరించాయి.. తమ కూతురు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాల అధ్యాపక బృందమే కారణం అంటూ పావని తల్లిదండ్రులు మెచ్చుకున్నారు.. లక్షలు పోసి ప్రైవేటు స్కూలు, కాలేజీలోనే కాదు.. మంచి బోధన, సత్ప్రవర్తన ఉంటే గవర్నమెంట్ కాలేజీలో కూడా మంచి ఫలితాలు సాధించవచ్చుని.. ఇందుకు తమ కూతురే ఉదాహరణ అంటూ.. పావని తల్లిదండ్రులు కితాబు ఇవ్వడం గమనార్హం.

# మోనియా లీక్.. 10 మందికి అస్వస్థత

నెల్లూరు, ఏప్రిల్ 12: జిల్లా టీ పీ గూడూరు మండలం అనంతపురం వాటర్ బేస్ కంపెనీలో అమోనియా లీక్ అయింది. దీంతో ఊపిరాడక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వెంటనే బయటకు పరుగులు తీశారు. కానీ 10మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కంపెనీ పరిసరాల్లోనూ అమోనియా వ్యాపించడంతో ముందు జాగ్రత్తగా మాస్కులు ధరించారు. మరికొంత మంది ఇంటి తలుపులు, కిటికీలు వేసుకుని లోపలే ఉండిపోయారు.

అయితే ఈ ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది.. అమోనియా లీక్‌ను అదుపు చేశారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# అసత్య ప్రచారం చేయద్దు... భూమనకు మంత్రి ఆనం వార్నింగ్



తిరుమల, ఏప్రిల్ 12:తిరుమల గోశాలలో వందకు పైగా గోవులు మరణించాయంటూ వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండిపడ్డారు. భూమన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. టీటీడీ గోశాలలో ఆవులు చనిపోయాయంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గోవుల విలువ తెలియని వ్యక్తులు ఈ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తిరుపతిలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు గోవును తల్లిగా భావిస్తారని ఆనం తెలిపారు. తల్లిలాంటి గోవుల పరిస్థితిని సీఎం, డిప్యూటీ సీఎం ప్రతిరోజు పరిశీలిస్తున్నారని చెప్పారు. గోశాలలో అన్ని వసతులు ఉన్నాయని, 230 మంది సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. వయసు పైబడి, అనారోగ్యంతో చనిపోయే ఘటనలను కూడా భూతద్దంలో చూపిస్తున్నారని మండిపడ్డారు. అమ్మ అనే పదానికి అర్థం తెలియని వ్యక్తి మీ నాయకుడు జగన్ అని అన్నారు. హిందూ ధర్మాన్ని మీ కుటుంబంలో మీరు పాటిస్తున్నారా? అని ప్రశ్నించారు.

ఆ వార్తలలో నిజం లేదు - టిటిడి ఛైర్మన్ ..

టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ గోశాలలో ఆవులు పెద్ద సంఖ్యలో మృతి చెందాయంటూ భూమన చెబుతున్న దాంట్లో నిజం లేదని టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు స్పష్టం చేశారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అవాస్తవాలు, కల్పిత ఆరోపణలు చేయడం అత్యంత విషాదకరం అని పేర్కొన్నారు. టీటీడీ ట్రస్ట్ ఎంతో అంకితభావంతో పుణ్య కార్యక్రమాలు చేపడుతుంటే, కంటగింపుతో ఈ తరహా చర్యలకు దిగడం బాధాకరమని బీఆర్ నాయుడు తెలిపారు. గోమాతకు హిందూ ధర్మంలో ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదని, వేద కాలం నుంచే గోమాతను దేవతలతో సమానంగా పూజిస్తూ వస్తున్నామని వివరించారు.

ఒక్క గోవు చనిపోయినా దానిని మృతిని సాధారణ ఘటనగా భావించలేమని? కానీ అనారోగ్యాలు, వృద్ధాప్యం, ప్రమాదాల వంటి కారణాలతో గోవుల మృతి చెందితే వాటిని రాజకీయంగా అబద్ధపు ప్రచారానికి వాడుకోవడం అత్యంత అధర్మం అని విమర్శించారు. ఇతర ప్రాంతాల్లో చనిపోయిన గోవుల ఫొటోలను టీటీడీ గోశాలకు చెందినవిగా చిత్రీకరించడం దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మోసగించేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడడం బాధాకరమని, ఇలాంటి వదంతులను ప్రజలు గుర్తించాలని, మోసపోవద్దని సూచించారు. గోసేవ అంటేనే గోదేవి సేవ? ఇంతటి పవిత్రమైన సేవపై రాజకీయ లబ్ధి కోసం బురద చల్లే ప్రయత్నాలను భక్తులందరూ తిరస్కరించాలని బీఆర్ నాయుడు పిలుపునిచ్చారు.

# వైభవంగా ఆది దంపతులకు గిరి ప్రదక్షిణ



అమరావతి, ఏప్రిల్ 12:శ్రీ విశ్వాస నామ సంవత్సర చైత్రమాస పౌర్ణమి రోజున ఆది దంపతుల గిరి ప్రదక్షిణాని అంత వైభవంగా కొనసాగింది. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి. పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టం. శనివారం చైత్ర పౌర్ణమి సందర్భంగా ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా ప్రారంభమైంది. ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమంను ప్రారంభించారు. తప్పెట్లు, మహిళల కోలాట నృత్యములు, భజన బృందాల సంకీర్తనలతో పాటు వివిధ కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళ వాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా సాగింది.

ఘాట్ రోడ్ అమ్మవారి గుడి, కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ కొనసాగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు విశేషంగా ఈకార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.

# వక్ఫ్ (సవరణ) చట్టం పశ్చిమ బెంగాల్‌లో అమలు కాదు

## -నిస్పష్టంగా ప్రకటించిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు

కోల్‌కతా ఏప్రిల్ 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వక్ఫ్ (సవరణ) చట్టం పశ్చిమ బెంగాల్‌లో అమలు కాదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం విస్పష్టంగా ప్రకటించారు. రాష్ట్రంలో హింసాత్మక నిరసనల నడుమ మమత ఆ స్పష్టీకరణ ఇచ్చారు. ఆ చట్టాన్ని కేంద్రం చేసిందని, సమాధానాలను కేంద్రం నుంచే కోరాలని మమత అన్నారు. 'అన్ని మతాల ప్రజలకు నా మనవి, దయచేసి ప్రశాంతంగా ఉండండి, సంయమనంతో వ్యవహరించండి. మతం పేరిట ఎటువంటి మత వ్యతిరేక చర్యలకూ దిగకండి. ప్రతి మానవ ప్రాణం విలువైనది; రాజకీయాల కోసం అల్లర్లను ప్రేరేపించకండి. అల్లర్లను ప్రేరేపించేవారు సమాజానికి హాని చేస్తున్నారు' అని మమత 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. కొత్త చట్టంపై శుక్రవారం నిరసనలు వెల్లువెత్తినప్పుడు మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో దౌర్జన్య సంఘటనలు ప్రజ్వరిల్లగా పోలీసు వ్యాన్లతో సహా అనేక వాహనాలకు నిప్పు పెట్టారు, భద్రతా దళాలపై రాళ్లు రువ్వారు, రోడ్లపై అవరోధాలు ఏర్పాటు చేశారు.'అనేక మందిని ఆగ్రహానికి గురి చేసిన ఆ చట్టాన్ని మేము చేయలేదని గుర్తు ఉంచుకోండి. ఆ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం చేసింది. కనుక మీకు కావలసిన సమాధానానికి కేంద్ర ప్రభుత్వాన్నే అడగండి' అని సిఎం అన్నారు. 'ఈ విషయమై మా వైఖరిని మేము స్పష్టం చేశాం. మేము ఆ చట్టాన్ని సమర్థించడం లేదు. మన రాష్ట్రంలో ఆ చట్టం అమలు జరగదు. మరి అల్లర్లు దేని గురించి' అని ఆమె అన్నారు. అల్లర్లను ప్రేరేపించేవారిపై చట్టపరమైన చర్య తీసుకోనున్నట్లు మమత స్పష్టం చేశారు. 'మేము ఎటువంటి హింసాత్మక చర్యనూ క్షమించడం లేదు. కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయ ప్రయోజనం కోసం మతాన్ని దుర్వినియోగం చేయజూస్తున్నారు. వారి మాటలకు లొంగకండి' అని ఆమె అన్నారు. 'మతం అంటే మానవత్వం, సుహృద్భావం, నాగరికత, సామరస్యం అని నా భావన. శాంతి, సామరస్యాలను పరిరక్షించాలని ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నాను' అని మమత తెలిపారు.




# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్లీనరీని విజయవంతం చెయ్యాలి

## - ఉద్యమకారుల చైతన్యయాత్రను జయప్రదం చెయ్యండి



ఖమ్మం, ఏప్రిల్, 12: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టియూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డా.చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు, ఏప్రిల్ 21 రోజున సికింద్రాబాద్ లో సీతాఫల్మండి ఫంక్షన్ నేను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యం లో ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చెయ్యాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్త "తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర'' జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 13/04/25న మధ్యాహ్నం 1:30 గంటలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అమరవీరుల స్థూపం వద్దకు ఈ చైతన్య యాత్ర విచేయుచున్నది, ఈ యాత్ర యొక్క ముఖ్య ఉద్దేశం ఏమనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలో భాగంగా 250గజాల స్థలాన్ని, 25 వెయ్యిల పెన్షన్ సౌకర్యాన్ని, ఇల్లు కట్టుకోవడానికి 10లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని కోరుతున్నాం. అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డా. కె.వి కృష్ణారావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య లు తెలుపుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న తొలిదశ, మలిదశ ఉద్యమకారులు అందరు, శ్రేయోభిలాషులు అం

# భారత్ ఎగుమతుల రంగంలో సరికొత్త రికార్డు

## - మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్ ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); భారత్ ఎగుమతుల రంగంలో సరికొత్త రికార్డు నెలకొలిపి నట్లు మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. ఇది 2013?14తో పోలిస్తే 160% వృద్ధి! అన్నారు. కాంగ్రెస్ పాలనలో భారతీయ ఎగుమతులు సుమారు ₹300 బిలియన్ వద్దే నిలిచిపోయాయి.కానీ 2014లో మోదీ గారు ఢిల్లీకి వచ్చాక, భారత్ ఎగుమతుల రంగంలో సరికొత్త రికార్డు సాధించింది!2023?24లో దేశం ₹778.21 బిలియన్ ఎగుమతులు చేసిందిఇది కొత్త భారత్ ? దృఢ సంకల్పం, సంస్కరణలు, ప్రపంచ విశ్వాసంతో దేశం ముందుకు సాగుతున్నట్లు తె లిపారు..

# పసుపులేటి వీక్షకు మెడల్స్ అందిస్తున్న కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య

## - రోలర్ స్కేటింగ్‌లో స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని ప్రతిభ.

## - వీక్షను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య

ఖమ్మం, ఏప్రిల్ 12 (నేటినిజం ప్రతినిధి) :రోలర్ స్కేటింగ్ క్రీడలో స్థానిక స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని పసుపులేటి వీక్ష ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్,







బ్రాంజ్ మెడల్ ను సాధించింది. ఇటీవల హైదరాబాదులో ఎల్ఆర్ఐ ఎస్ఎ, సిఎస్ సి సంస్థ నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీలో వీక్ష రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ ను సొంతం చేసుకుంది. అలాగే ఎస్ఎస్ రోలర్ స్కేటింగ్ అకాడమీ నిర్వహించిన పోటీల్లోనూ వీక్ష బ్రాంజ్ మెడల్ ను సాధించింది. రోలర్ స్కేటింగ్లో వరుసగా మెడల్స్ సాధిస్తున్న పసుపులేటి వీక్షను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య లు శనివారం అభినందించారు. పసుపులేటి వీక్షకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు అందించి అభినందనలు తెలిపారు.

# తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఘోర అపచారం.. భక్తులు ఆగ్రహం



తిరుమల ఏప్రిల్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఘోర అపచారం జరిగింది. శ్రీవారి ఆలయంలోకి పాదరక్షలు ధరించి ముగ్గురు భక్తులు ఆలయంలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన ఆలయ సిబ్బంది వారిని అడ్డుకొని పాదరక్షలు విప్పించారు. అయితే ఆలయ పరిసరాలకు వచ్చే వరకూ పాదరక్షలు గమనించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిటిడి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని.. అంటున్నారు. మూడు ప్రాంతాలలో తనిఖీ చేసిన టిటిడి విజిలెన్స్ అధికారులు వీరిని గురించకపోవడంపై మండిపడుతున్నారు.

# భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన మేకల మల్లిబాబు యాదవ్



ఖమ్మం, ఏప్రిల్, 12: (నేటినిజం ప్రతినిధి): కావేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బానోతు రాములు అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మరణించడం జరిగింది. వారి భౌతిక కాయానికి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ పూలమాలదేసి నివాళులు అర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మేమున్నామని భరోసా కల్పించారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షకుడు పద్మశ్రీ వనజీవి రామయ్య చనిపోవడం చాలా దురదృష్టకరమైన విషయమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా తన సతీమణితో కూడి పర్యావరణ పరిరక్షణకు నడుం కట్టి కోటికి పైగా మొక్కలు నాటించి ఎందరికో మార్గదర్శకులు అయ్యారు. వారు మన ప్రాంత వాసి అయినప్పటికీ. వారి పేరు ఖండాంతరాలలో వ్యాపించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఎవరైనా కాలాగర్భంలో కలిసిపోవడమే కానీ నిరంతరం ప్రకృతినే ప్రేమిస్తూ, తద్వారా మానవ మనుగడ ను కాపాడుతూ చివరకు ఆ ప్రకృతిలోనే కలిసిపోయిన మహానుభావుడు వనజీవి రామయ్య అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్, భూక్యా నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాద్, సోమన్న పోయిన మల్లికార్జున్, నాగండ్ల జగ్గయ్య, అంబడిపూడి చిన్న వెంకటేశ్వర్లు, ధనియాకుల రామన్న, బొగ్గారపు రామచంద్రయ్య, సేలం పుల్లయ్య, బానోత్ భీముడు, బానోత్ చందు, బానోత్ గోరియా, బానోతు నాగులు, భానోత్ బాసు, బానోతు రాము, దేరంగుల తిరుపయ్య, రాయల నాగ శంకర్, బంధుమిత్రులు తదితరులున్నారు.

# రాజీవ్ యువవికాస్ దరఖాస్తు తేదీని పొడిగించాలి

## - ఎన్ వి రాకేష్ పివైఎల్ జిల్లా కార్యదర్శి

ఖమ్మం, ఏప్రిల్, 12: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యువతకు ఆర్థిక భరోసా కల్పించే దృష్టితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకానికి అప్లై చేసుకునేందుకు దరఖాస్తు తేదీని మరొకసారి పొడిగించాలని ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ వి రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇలా అన్నారు శని ఆది సోమవారాలు సెలవులు కావడం వల్ల మరియు సైట్ ఓపెన్ కాకుండా ఇబ్బందులు పెడుతున్న దృశ్య అనేక రోజులుగా యువత ఈ పథకానికి అప్లై చేసుకోవడం కోసం రోజులుగా ఎదురు చూస్తున్న సైట్ మొరాయించటం వల్ల అతి కొద్ది మందికి మాత్రమే అవకాశం దొరుకుతుంది. ఈ సేవ కేంద్రాలు తెల్లవారుజాము నుండి అర్ధరాత్రి వరకు పడి కాపులు కాస్తున్నారని ఆయన అన్నారు. ఏదైనా సర్టిఫికెట్ లేకపోయినా తర్వాత ఎడిట్ ఆప్షన్ ఇచ్చి అప్డేట్ చేసుకున్న అవకాశాన్ని కల్పించాలని కోరారు రెవెన్యూ అధికారుల సైతం కుల ఆదాయ సర్టిఫికెట్ లని త్వరగా దరఖాస్తుదారులకు అందించాలని కోరారు ఆఫ్లైన్లో దరఖాస్తులు ఇచ్చే అవకాశాన్ని కల్పించలని కోరారు. ప్రభుత్వ స్పందించి తేదీని పొడిగించకపోతే నిరుద్యోగుల తరపున పెద్దఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ పథకాన్ని పంపిణీ లో దళారీలు రాజకీయ పార్టీలు నేతలకు అవకాశం లేకుండా పారదర్శకంగా అందించాలని కోరారు.

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి- ఎమ్మెల్యే బొజ్జు పటేల్



అమరావతి, ఏప్రిల్ 12: తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో హనుమాన్ ఆలయం చుట్టూ 6లక్షల పైచిలుకు నిధులతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూమన్న భూషణ్, ఆలయ కమిటీ చైర్మన్ కె.దినకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ కడెం మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తక్కళ్ళ సత్తన్న, ఆకుల లచ్చన్న, కోల శ్రీనివాస్, కె రాజేష్, మార్కాపు లక్ష్మణ్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు అంజన్న స్వామి, మాలదారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డికి టీజీపీఎస్సీ పరువునష్టం దావా నోటీస్

హైదరాబాద్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డికి టీజీపీఎస్సీ షాక్ ఇచ్చింది. గ్రూప్-1 ఫలితాల విషయంలో తమపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో ఈ నోటీసులకు సమాధానం ఇచ్చి, క్షమాపణలు చెప్పాలని, లేదంటే పరువు నష్టం కేసులు, ఇతర క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. ఇకపై టీజీపీఎస్సీపై రాకేశ్ రెడ్డి ఎలాంటి ఆరోపణలు చేయవద్దని ఆ నోటీసుల్లో పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టవద్దని కూడా తెలిపింది.

టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్‌లోని అన్ని పేపర్లను రీవ్యాల్యుయేషన్ చేయాలని ఏప్రిల్ 1వ తేదీన రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణ, వాల్యుయేషన్‌లో తప్పిదాలు జరిగాయని, వాటిని సరిదిద్దుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గ్రూప్-1లో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని, 40 శాతం మంది విద్యార్థుల్లో టాప్ 500లో ఒక్కరు కూడా లేరని ఆయన అన్నారు.

45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తే కేవలం 10, 15 కేంద్రాల్లోని అభ్యర్థులే టాపర్లుగా నిలిచారని, మిగతా కేంద్రాల్లోని వారు ఎందుకు లేరని ప్రశ్నించారు. ఏపీపీఎస్సీలో 6 వేల పేపర్లు దిద్దడానికి 40 రోజుల సమయం తీసుకుంటే, ఇక్కడ 20 వేల పేపర్లను తక్కువ సమయంలో ఎలా దిద్దగలిగారని రాకేశ్ రెడ్డి ప్రశ్నించారు.

# అప్పుల ఊబిలో తెలంగాణ- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, ఏప్రిల్ 12: తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

రాష్ట్రం అప్పుల నుంచి కోలుకోవాలంటే కేంద్ర సాయం అవసరం అని అన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయట పడేలా చేయాడానికి బీఆర్ఎస్ పార్టీ సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే వక్ఫ్ బోర్డు కోసం చట్టం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వ ఓ మతాన్ని రెచ్చగొట్టి రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూమి వ్యవహారంలో ఉన్న ఆ బీజేపీ ఎంపీ ఎవరో కేటీఆర్ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు బీఆర్ఎస్ పార్టీ తో కలిసి పని చేసే ఆలోచన లేదని, కాంగ్రెస్ తోనే ఫ్రెండ్లీ పాలసీ కొనసాగిస్తామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు.

# వేములవాడలో సైట్ మ్యూజియం ఏర్పాటు చేయాలి!

## -భీమేశ్వరాలయ శిల్పాలను సందర్శించిన ప్రముఖ పురాతత్వశాస్త్రవేత్త డా. ఈమని శివనాగిరెడ్డి బృందం



వేములవాడ, ఏప్రిల్ 12: తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరాలయంలోని 9,10 వ శతబ్దాలకు చెందిన అపురూప జైన, బౌద్ధ, హిందూ శిల్పాలను పదిలపరచాలని, వాటినన్నింటిని శుభ్రపరచి, సైట్ మ్యూజియం ఏర్పాటు చేసి, సందర్శకులకు అందుబాటులో ఉంచాలని ప్రముఖ పురతత్వ నిపుణులు డా. ఈమని శివనాగ్రిరెడ్డి బృందం కోరింది. వేములవాడ భీమేశ్వరాలయం దక్షిణ భాగాన తోట లోని ఓ మూలన జైన, బౌద్ధ, హిందూ శిల్పాలు, సప్త మాతృకలు, దేవీ శిల్పాలు, శివలింగాలను పడవేశారని, అవి ఆలనా పాలనా లేక చెడిపోతున్నాయని డా. శివనాగిరెడ్డి బృందం ఆవేదన వ్యక్తం చేసింది. భీమేశ్వరాలయం ముందు గణపతి విగ్రహం, ఒక శిలా శాసనం కూడా ఉందని, వాటిని పరిశీలించినట్లు ఆయన చెప్పారు. స్థానిక చరిత్రకారులు సంకేపల్లి నాగేంద్రశర్మ సూచనల మేరకు పురాతన శిల్పాలను సందర్శించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిల్పాలు సుమారు వేయి నుండి పన్నెండు వందల సంవత్సరాల వయస్సు గలవని, అపూరూప శిల్పాలని అన్నారు. భీమేశ్వరాలయాన్ని, కేదారేశ్వరాలయాన్ని ఆయన సందర్శించారు. కేదారేశ్వరాలయం కృంగి పోయి ఉందని, పురావస్తు శాఖ వారు రిపేర్లు చేయాలని ఆయన అన్నారు. అలంపురం జోగులాంబ దేవాలయంలోగుడిలో సైట్ మ్యూజియం ఉందని అన్నారు. వేములవాడ జైన విగ్రహాలలో అయిదింటిని హైదరాబాద్ లోని బిర్లా మ్యూజియానికి తరలించారని నాగేంద్రశర్మ చెప్పారు. వేములవాడ దేవస్థానానికి సుమారు 15వందల చరిత్ర ఉందని అన్నారు. ఈ బృందంలో ప్రముఖ దేవాలయాల స్థపతి బి. సుధాకర్ సింగ్, నాగేంద్రశర్మలు ఉన్నారు. వేములవాడ దేవాలయం విస్తరణలో భాగంగా ఇక్కడి పురావస్తు అంశాలను భద్రపరచాలని, కాపాడాలని ఆయన కోరారు. భీమేశ్వరాలయం రాష్ట్ర పురావస్తు శాఖ పరిధిలో ఉందని, దేశ ప్రధానిగా పనిచేసిన పివి లాంటి వారు ధర్మక్రర్తలుగా ఉన్నారని ఈ బృందం గుర్తు చేసింది. వేములవాడ దేవస్థానం, పురావస్తు శాఖ సహకారంతో సైట్ మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని ఈ బృందం కోరింది. భద్రాచలం, షిరిడీ దేవస్థానాలలో కూడా సైట్ మ్యూజియాలు ఉన్నాయని వీరు తెలిపారు.


తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

మహిళా భారతి - తెలంగాణ సంయుక్త

ఆధ్వర్యంలో...



డా. శ్రీభాష్యం అనూరాధ

(తెలుగు అధ్యాపకులు)

"తనబ్బ" – కవితాసంకలనం

పుస్తక ఆవిష్కరణ సభ

తేది. : 18-4-2025, సాయంత్రం 5.30 ని॥లకు

స్థలం : రవీంద్ర భారతి సమావేశ మందిరం

(మొదటి అంతస్తు), హైదరాబాదు

| | | |
|---|---|---|
| స్వాగతం | : | డా. శ్రీభాష్యం యదుమోహన్ (యదుగ్రాఫిక్స్ Y8 ఛానల్ అధినేత) |
| సభాధ్యక్షులు | : | డా. నాళేశ్వరం శంకరం (అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం) |
| ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త | : | డా. నందిని సిధారెడ్డి (తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షులు) |
| గౌరవ అతిథి | : | శ్రీ మామిడి హరికృష్ణ (సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ) |
| విశిష్ట అతిథి | : | శ్రీ ఎ. కృష్ణారావు (అసోసియేట్ డైరెక్టర్, ఆంధ్రజ్యోతి) |
| ఆత్మీయ అతిథులు | : | శ్రీ బైసా దేవదాసు (ప్రధాన సంపాదకులు, నేటి నిజం పత్రిక) శ్రీ మేక రవీంద్ర గారు (అధ్యక్షులు, సహస్ర కవిసమూహం, తెలుగు అభివృద్ధి సమితి) శ్రీ చింతపట్ల సుదర్శన్ (విమర్శకులు, రచయిత, కవి) |
| పుస్తక సమీక్ష | : | డా. దాసోజు పద్మావతి (మహిళా భారతి అధ్యక్షులు) |
| వందన సమర్పణ | : | శ్రీమతి మూర్తి శ్రీదేవి, (ప్రధానకార్యదర్శి, అక్షర కౌముది సంస్థ) |

'సాహిత్యాభిమానులందరికీ సాదర స్వాగతం!


# బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ హయాంలో ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం కూచారం గ్రామంలో జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాల్లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూచారం హనుమాన్ దేవాలయానికి రూ. 22 లక్షల రూపాయలు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

అంతకు ముందు ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఛైర్ పర్సన్ హేమలతా శేఖర్ గౌడ్‌లతో, నాచారం గుట్ట దేవస్థానం మాజీ ఛైర్మెన్ కొట్టాల యాదగిరితోపాటు ఉద్యమ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా కూచారం గ్రామ చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకుని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి మాదిరా.. సవతి తల్లి మాదిరా అంటూ కాంగ్రెస్ పార్టీనుద్దేశించి అన్నారు. అనంతరం నిర్వహించిన శోభాయాత్రలో ఆమె పాల్గొన్నారు.

అనంతరం గ్రామంలోని కోదండ రామాలయాన్ని, హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ మాజీ ఎంపీపీ పురం రవి నవనీత ముదిరాజ్, పార్టీ గ్రామాధ్యక్షుడు దాసరి నరేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్, అనంతారం వీరేష్ గౌడ్, మంగ్యా నాయక్, నాయిని నందు గౌడ్, మొద్దు ప్రేమ్ కుమార్, అర్కల రమేష్ ముదిరాజ్, యావపురం కృష్ణ, రాజు నాయక్, తొంట శంకర్, చింపుల మురళి, వడ్డె యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి శోభాయాత్రనలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్, ఏప్రిల్ 12: ఉట్నూర్ పట్టణంలోని బోయవాడలో ఉన్న హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మందిర్ లో వందలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం ఆలయ పూజారి బాలాజీ ధోబె వర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్, ప్రముఖులు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ భుఖ్య జాన్సన్ నాయక్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీ రాథోర్ రమేష్ తనయుడు రితీష్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ అదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జి ఆత్రం సుగుణ, బీజేపీ రాష్ట్ర నాయకులు భానోత్ జగన్ శ్రీరామ్ నాయక్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, సీఐ మొగిలి ఎస్సై మనోహర్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హనుమాన్ జయంతి శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శోభాయాత్రలో ఎమ్మెల్యే, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు భక్తులు పాల్గొన్నారు. శోభాయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఘనంగా ఎంతో ఉత్సవంగా జైశ్రీరామ్ నామ స్మరణంతో కొనసాగింది. ఈ హనుమాన్ జయంతి వేడుకల్లో ఆదిలాబాద్ ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, హిందూ ఉత్సవ సమితి నాయకులు సాదిగే రాజగోపాల్, అరికెళ్ల అశోక్, రవీందర్, ఠాగూర్ గోపాల్ సింగ్, ఉట్నూర్ మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, కేంద్ర నాయకులు శ్రీరామ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు కొత్తపెల్లి మహేందర్, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి : హరీశ్ రావు

-రుణమాఫీ కాలేదు.. రైతుబంధు పడలేదు
-ఒక సిద్దిపేట జిల్లాలోనే పదివేల ఎకరాల పంట నష్టం
-రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి



సిద్ధిపేట ఏప్రిల్ 12: పంట నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్ ఫుట్ సబ్సిడీ ఇవ్వాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. నంగునూరు మండల పరిధిలోని రాజగోపాల్ పేట్ గ్రామంలో వడగండ్ల వాన వల్ల దెబ్బతిన్న పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఒక రైతు రాగుల బాలయ్య వారి సతీమణి బాలమ్మలకు మూడెకరాల పొలం ఉందని, అందుకు రుణమాఫీ కోసం రెండు లక్షల పైనున్న రుణాన్ని అప్పు తెచ్చారని ఇంకా రుణమాఫీ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేసి తన ముందు వారి గోడును వినిపించినట్లు హరీష్ రావు తెలిపారు. దీంతో పాటు రుణమాఫీ కాలేదు రైతుబంధు పడలేదనే బాధలో ఉన్నారన్నారు. అసెంబ్లీలో ఈ ప్రభుత్వం చాలా గొప్పగా చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పంటల బీమా తెస్తాం, రైతు బంధు రూ.15000 ఇస్తాం, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. వానకాలం రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. యాసంగి సగం మందికి వేశామన్నారు. ఆ సగం మందికి కూడా పూర్తిగా రైతుబంధు రాలేదన్నారు.

ఆనాడు కేసీఆర్ ఉన్నప్పుడు అందరికీ రైతుబంధు డబ్బులు పడ్డాయి. ఈ ప్రభుత్వం కోతలు పెట్టాలని మొత్తం సర్వే నెంబర్లలో అద్దెకరం, పావు ఎకరం ఎక్కువ ఉందనే సాకుతో రైతులకు రైతుబంధు ఇవ్వలేదన్నారు. 9,000 కోట్ల రూపాయలు రైతుబంధు ఇవ్వాల్సి ఉంటే నాలుగు వేల కోట్లు మాత్రమే ఇచ్చాం అంటున్నారు. ఇంకా 5000 కోట్లు రైతుబంధు కోత పెట్టారన్నారు. వానకాలం 9000 కోట్లు ఈ యాసంగి 5వేల కోట్లు మొత్తం రూ. 14వేల కోట్లు ప్రభుత్వం రైతులకు ఎగనామం పెట్టిందన్నారు. రూ. 14 వేల కోట్లు రైతుబంధు ఎగ్గొట్టి వాటిని రుణమాఫీ లో ఇచ్చినట్టు చూపిస్తున్నారు. కరోనా కష్టకాలంలో కూడా రైతులకు రైతుబంధు కేసీఆర్ ఆపలేదన్నారు. పంట బీమాకు సంబంధించి బడ్జెట్లో డబ్బులు పెట్టి ఒక్క రైతుకు కూడా ఇవ్వలేదన్నారు. పంట నష్టపరిహారం ఎకరానికి రూ. 6,000 ఉంటే కేసీఆర్ పదివేలకు పెంచారని గుర్తు చేశారు. పోయిన ఎండాకాలం సిద్దిపేట జిల్లాలో 1,350 ఎకరాల్లో వడగళ్ల వానకు పంట నష్టం జరిగింది, 1350 ఎకరాలకు పంట నష్టం ఇప్పటి వరకు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. తక్షణమే పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ అందించాలని వారి తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టం చేసిన రైతులకు వడగళ్ల వాన నోటికాడి బుక్క కొట్టినట్టు అయిందన్నారు. నంగునూర్ మండలంలో 11 గ్రామాల్లో దాదాపు 5,300 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు గుర్తించామన్నారు. ఒక సిద్దిపేట జిల్లాలోనే 10,000 వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని అంచనా అన్నారు.

2500ఎకరాల హార్టికల్చర్ పంటలు కూడా నష్టపోయాయి..

ఇన్పుట్ సబ్సిడీతో పాటు యాసంగి రైతుబంధు కూడా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు బీమా విషయంలో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, చాలామంది చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదన్నారు. వెంటనే చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు బీమా డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఉండగా అనేక విత్తనాలు సబ్సిడీ కింద ఇచ్చేవారని, కందులు, పెసర్లు, వరి లాంటి విత్తనాలను సబ్సిడీ కింద ఆనాటి ప్రభుత్వం అందించిందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద విత్తనాలను అందుబాటులో పెట్టి రైతులకు సకాలంలో అందించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీతో పాటు వచ్చే వానాకాలానికి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతుల గురించి ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, కౌలు రైతుకు రైతుబంధు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఇటు రైతు బంధు రాక ఇన్పుట్ సబ్సిడీ రాక కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే వడగండ్ల వానకు పంట నష్టపోయిన కౌలు రైతులకు కూడా ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చిన్నకోడూరు మండలంలో ఇంకా 7,352 మందికి రుణమాఫీ జరగలేదు.. హరీష్ రావు

చిన్న కోడూరు, ఆంధ్రప్రభ, ఏప్రిల్ 12 : సిద్దిపేట్ చిన్నకోడూరు మండలంలో రుణమాఫీ జరిగిన రైతులు 5,300 మంది ఉంటే ఇంకా 7,352 మందికి రుణమాఫీ జరగలేదు.రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి నేను సవాల్ చేస్తున్నాను ఏ ఊర్లో పూర్తి రుణమాఫీ జరిగిందో చెప్పండి.రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా చెల్లిస్తామని బడ్జెట్లో నిధులు కూడా కేటాయించి మొండి చేయి చూపించింది.ప్రభుత్వం నిజంగా పంటల బీమా చేసి ఉంటే రైతులకు మేలు జరిగేది.రైతులందరినీ ఆదుకోవాలని, వచ్చే వాన కాలంలో విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, 25 వేల ఇన్పుట్ సబ్సిడీ ఎకరానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.చెట్ల నరికే రేవంత్ రెడ్డి చెట్లు పెట్టే రామయ్యకు సంతాపం చెప్పడం అంటే హంతకుడే సంతాపం తెలిపినట్లుంది.ఈరోజు అధికారులు వాళ్ళ ఉద్యోగాలు పోయి జైల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.రేవంత్ రెడ్డి తప్పుడు పనుల వల్ల అధికారులు బలయ్యే పరిస్థితి ఏర్పడింది.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గోనేపల్లి, రాముని పట్ల, ఇబ్రహీం నగర్ గ్రామాల్లో వడగండ్ల వానతో పంటనష్టం జరిగిన పొలాలను మాజీ మంత్రి హరీష్ రావు పరిశీలించారు. ఈసందర్భంగా మీడియాతో హరీష్ రావు మాట్లాడుతూ ? సిద్దిపేట జిల్లాలో వడగండ్ల వానకు తీవ్ర పంటనష్టం జరిగిందని రైతులు చాలా ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా చేస్తామని బడ్జెట్లో నిధులు కూడా కేటాయించి మొండి చేయి చూపించిందన్నారు. ప్రభుత్వం నిజంగా పంటల బీమా చేసి ఉంటే రైతులకు మేలు జరిగేదన్నారు. పంటల బీమా చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25వేల రూపాయల ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. చిన్నకోడూరు మండల్ ఇబ్రహీం నగర్ గ్రామంలో ఏ రైతును అడిగినా రుణమాఫీ కాలేదనే చెప్తున్నారన్నారు. 40శాతం మందికి రుణమాఫీ జరిగితే 60% మందికి జరగలేదన్నారు. రైతుబంధు విషయంలో కూడా సగం మంది రైతులకు అందలేదు. రేవంత్ రెడ్డికి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అన్నారు.

తాను మొన్న అసెంబ్లీలో అడిగాను భట్టి విక్రమార్క గారు సిద్దిపేటలో ఏ ఊరికి వెళ్దామో రండి లేదా మధిర నియోజకవర్గంలో ఏ ఊరికి రమ్మంటారో చెప్పండి వస్తానని.. అందరికీ రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని అన్నాను. నరసయ్య అనే రైతు రైతుబంధు పడలేదు, రుణమాఫీ కాలేదు పైగా వడగండ్ల వానకు పంట నష్టపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం 3,000 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మొత్తంగా 12 వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందన్నారు. చిన్నకోడూరు మండలంలో రుణమాఫీ జరిగిన రైతులు 5,300 మంది ఉంటే ఇంకా 7,352 మందికి రుణమాఫీ జరగలేదు. గన్ మెన్లు లేకుండా, పోలీసులు లేకుండా ఏ ఊరికి వెళ్దాము రండి రుణమాఫీ ఎక్కడ జరిగిందో చూద్దాం. రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి నేను సవాల్ చేస్తున్నాను ఏ ఊర్లో పూర్తి రుణమాఫీ జరిగిందో చెప్పాలన్నారు. వడగండ్ల వానకు నష్టపోయిన పంటల్లో రకరకాల పంటలు ఉన్నాయి. వరితోపాటు మిర్చి, టమాటా, కూరగాయల పంటలు చాలా ఉన్నాయన్నారు.

రైతులందరినీ ఆదుకోవాలని, వచ్చే వాన కాలంలో విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, 25వేల ఇన్పుట్ సబ్సిడీ ఎకరానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య మృతి పట్ల బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్ర సంతాపాన్ని తెలుపుతున్నానన్నారు. వారు వారి భార్య అడవుల పెంపకం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావులన్నారు. ప్రతిక్షణం ఒక్కొక్క చెట్టును కాపాడడానికి ఎంతో ప్రయత్నం చేశారన్నారు. వారి మరణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. చెట్లు నరకడం రేవంత్ రెడ్డి వంతు, చెట్లు పెట్టడం రామయ్య గారి వంతు అన్నారు. చెట్లు నరికే రేవంత్ రెడ్డి చెట్లు పెట్టే రామయ్యకు సంతాపం చెప్పడం అంటే హంతకుడే సంతాపం తెలిపినట్టుందన్నారు. హార్టికల్చర్ యూనివర్సిటీలో చాలా ఎకరాల్లో చెట్లని నరికేశాడన్నారు. హెచ్ సీయూలో 400ఎకరాల్లో చెట్లను నరికాడన్నారు. ఈరోజు అధికారులు వాళ్ళ ఉద్యోగాలు పోయి జైల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. రేవంత్ రెడ్డి తప్పుడు పనుల వల్ల అధికారులు బలయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. చెట్ల పెంపకం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం వారి జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన మహనీయులు వనజీవి రామయ్యకు, వారి కుటుంబ సభ్యు లకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

# షాపింగ్ అని వచ్చి చీరలు కొట్టేస్తున్న ముఠా.. గుట్టురట్టు చేసిన మియాపూర్ పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 12:: భారీ షాపింగ్ చేస్తామని బిల్డప్ ఇస్తూ ఖరీదైన చీరలను ఎత్తుకెళ్తున్న ఓ దొంగల ముఠా ఆట కట్టించారు మియాపూర్ పోలీసులు. ఓ వస్త్ర దుకాణంలో ఖరీదైన చీరను ఎత్తుకెళ్లారని ఓ షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ కెమెరాల సాయంతో నిందితులను గుర్తించి, వారిని అరెస్టు చేశారు.

మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన వెంకటేశ్వరరావు, సుభాషిణి, యశోద, తిరుపతమ్మ, రమణ, వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వర్లు సహా పలువురు కలిసి ఒక ముఠాగా ఏర్పడి బట్టల దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 3వ తేదీన మియాపూర్ లోని ఎంఏ నగర్‌లోని ఓ వస్త్ర దుకాణంలోకి బట్టలు కొనే సాకుతో ఈ బృందం లోపలికి వెళ్లింది. ఈ సందర్భంగా దుకాణదారుడిని మాయమాటల్లో పెట్టి వారు ఖరీదైన చీరను కొట్టేసి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ బృందం వెళ్లిపోయిన తర్వాత చీర లేదని గ్రహించిన దుకాణదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దుకాణదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో దొంగల ముఠాను పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠా మియాపూర్‌తో పాటు మధురా నగర్, సరూర్ నగర్, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు దుకాణాల్లో కూడా ఖరీదైన చీరలను దొంగలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ దొంగల ముఠాను పట్టుకున్న సీఐ క్రాంతి, డీఐ రమేశ్ నాయుడు, ఇతర సిబ్బందిని ఏసీపీ శ్రీనివాస్ అభినందించారు.

# శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 12(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొనిని శ్రీ ఆంజనేయ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆ ఆంజనేయ స్వామి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండి వర్షాలు సమృద్ధిగా కృషి పంటలు బాగా పండి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని వేడుకున్నట్లు తెలిపారు .. ఈ కార్యక్రమంలో నీలం శేఖర్, ముత్త మహేష్ , భాస్కరరావు, శ్రీనివాస్, కొమ్మన బోయిన అభిమన్యు, మంద అనిల్, గోనెల సతీష్ గౌడ్, కచ్చ కాయల మహేష్, శేఖర్, కట్ట ప్రవీణ్ గౌడ్, వెంకట్ సాయి భగవాన్, అరవింద, అఖిల్ , యువకులు, తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఏనుగు మనోహర్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 12(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంగరాజు, పార్టీ మండల అధ్యక్షులు గోస్కుల రవి, మాజీ ఎంపీటీసీ వెల్మ నర్సవ్వ- బాల్ రెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ రాఘవ రెడ్డి,ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కదారి తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ షేక్ అహ్మద్, మాజీ వార్డు సభ్యులు పొత్తూరి శ్రీనివాస్, సోయినేని రాజుడ నర్సయ్య, అనిల్ రెడ్డి, ప్రభాకర్, రాజేంద్ర ప్రసాద్, మహేష్, గోస్కుల వేణు,గంగాధర్,రవి,బాలాజీ,హరీష్,భగవాన్, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేకలు పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 12(నేటినిజం ప్రతినిధి): హనుమాన్ జయంతి సందర్భంగా వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీ ఆంజనేయ స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ ఈఓ నాగరపు శ్రీనివాస్. ఘన స్వాగతం పలికారు ఆలయ అర్చకులు వేదో ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆది శ్రీనివాస మాట్లాడుతూ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ నెల 4 తేది నుండి ఆలయంలో స్వామి వారి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని,మన రాష్ట్రం లో హనుమాన్ ఆలయం లేని గ్రామాలు లేవని,గతంలో ఎమ్మెల్యే గా కాకున్నా ప్రతి ఏటా ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకునేవాడిని అన్నారు.అంజన్న ఆలయ అభివృద్ధి కి కృషి చేస్తానని అన్నారు.




పరమ పూజ్య గురూజీ శ్రీ ఋషి ప్రభాకర్ జీ నెలకొల్పిన విశ్వేశ్వర తపోక్షేత్ర, గ్రా॥ వెంకటాపూర్, సిద్దిపేటలో

తేది: 13-04-2025 ఆదివారం
ఉదయం 10-00 గం॥లకు



శ్రీ జక్కని వేంకట రాజం రచించిన
"తైత్తిరీయోపనిషత్తు" (అనువాదం)
మరియు శ్రీ రామ శతకం (కందాలు)
గ్రంథాల ఆవిష్కరణ

సభాధ్యక్షులు
ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్ప గారు
(పూర్వాధ్యక్షులు తెలుగు శాఖ, ఉ.వి.)

ఆవిష్కర్త
ఆచార్య డా॥ రేకా అశోక్‌కుమార్ జీ (బ్రహ్మోపదేశకులు)

"తైత్తిరీయోపనిషత్తు" కృతి స్వీకర్తలు
శ్రీ బైస దేవదాసు గారు
శ్రీమతి బైస వీణాదాసు గారు

విశిష్ట అతిథి
శ్రీ కుప్పా శ్రీపాద శర్మ (విద్యావేత్త)

ఆత్మీయ అతిథి
శ్రీ గంజి యాదగిరి స్వామీ జీ (యజ్ఞ, వేద పండితులు)

అందరూ ఆహ్వానితులే

భోజనానంతరం : ఋషికుల్ టౌన్‌షిప్ సన్నాహక సమావేశం


# మణిపూర్ మహిళను హత్య చేసిన.. సహజీవనం చేస్తున్న వ్యక్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:మణిపూర్‌కు చెందిన మహిళకు మరో వ్యక్తితో సంబంధం ఉందని సహజీవనం చేస్తున్న వ్యక్తి అనుమానించాడు.

ఈ నేపథ్యంలో ఆమెను హత్య చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు మణిపూర్‌కు చెందిన నిందితుడ్ని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. మునిర్కా ప్రాంతంలో గాయాలతో కూడిన మహిళ మృతదేహం ఉన్నట్లు ఏప్రిల్ 8న పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్నారు. బిల్డింగ్‌లోని ఐదో అంతస్తులోని ఒక గదిలో పడి ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించారు. మృతురాలిని మణిపూర్‌లోని చురచంద్‌పూర్‌కు చెందిన లింగ్ జానెంగ్‌గా గుర్తించారు.

కాగా, ఆ ఇంట్లో నివసిస్తున్న మణిపూర్‌లోని సేనాపతి జిల్లాకు చెందిన జగ్మింతంగ్‌తో ఏడాదిగా ఆమె సహజీవనం చేస్తున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు.

ఆ మహిళ హత్యకు ముందు రోజు రాత్రి మరో ముగ్గురితో కలిసి వారు పార్టీ చేసుకున్నట్లు స్థానికులు చెప్పారు.

మరోవైపు ఆ పార్టీ తర్వాత లింగ్ జానెంగ్‌కు మరో వ్యక్తితో సంబంధం ఉందన్న అనుమానంతో జగ్మింతంగ్ కొట్టి చంపినట్లు దర్యాప్తులో పోలీసులకు తెలిసింది.

దీంతో అతడ్ని అరెస్ట్ చేశారు. అయితే తొలుత పోలీసులను తప్పుదారిపట్టేందుకు ప్రయత్నించిన అతడు చివరకు ఆ మహిళను చంపినట్లు ఒప్పుకున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 12: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం హనుమాన్ జయంతి (ఊజీనిబీఎజీని ఏజీఎజీనిబితి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ ( ఎవశ్రీటజీనిటజీ) మండలం కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామి ఆలయాల్లో వ్రతాలు, నోములు,అభిషేక పూజలు, యజ్ఞహోమాలు చేశారు. కొత్త తండాలోని హనుమాన్ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నారాయణపేట మండలంలో..

పేట మండల పరిధిలోని జాజాపూర్, అప్పి రెడ్డిపల్లి, లక్ష్మీపూర్, తిరుమలాపూర్‌తో పాటు ఇతర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాజాపూర్ గ్రామంలోని జెట్టి హనుమాన్ మందిర్ వద్ద ధ్వజారోహణం, అభిషేకం, ప్రత్యేక పూజలు , హోమం నిర్వహించారు. కొత్త కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్చంపేట పట్టణంలో..

అచ్చంపేట పట్టణంలోని జూబ్లీ నగర్ అయ్యప్ప హనుమాన్ ఆలయంలో శనివారం ఘనంగా హనుమాన్ జయంతిని పలు ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి శోభాయాత్రను పురవీధుల గుండా నిర్వహించారు. ధార్మిక సంఘాల నాయకులు మండికారి బాలాజీ, అంజనీ మాత మహిళా మండలి సభ్యులుపాల్గొన్నారు.

అంజన్న రథోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఊట్కూర్: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పగిడిమర్రి గ్రామంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ఆంజనేయ స్వామి రథోత్సవ వేడుకలను సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. బంతిపూలతో ఆకర్షణీయంగా ముస్తాబు చేసిన రథంలో స్వామివారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మారుతి ఆంజనేయస్వామి ఆలయం నుంచి పురవీధుల్లోకి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి , మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వేడుకల్లో పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు బసవరాజ్ గౌడ్, మురళీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నారాయణ గౌడ్, విష్ణు మూర్తి గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలకృష్ణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సూర్యప్రకాష్ రెడ్డి, మక్తల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరసింహ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎం. భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి : గొంగిడి సునీత

హైదరాబాద్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాజేపట మండల కేంద్రంలో హనుమకొండ జిల్లా ఎలకుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గులాబీ శ్రేణులు దండుగా కదిలి వచ్చి సభను విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, సెక్రటరీ భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, ఠాగూర్ ప్రమోద్ సింగ్, ఎర్రగోకుల జస్వంత్, గోపగాని యాదగిరి గౌడ్, బెడిదే వీరేశం, కట్కం స్వామి, ఏమ్మా భాస్కర్, గొల్లూరి శ్రీకాంత్, షాగర్ల పరమేశ్, గోపగాని శ్రీనాథ్, గంధమల సురేశ్, అబ్దుల్, ఆబిద్ పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.